సూర్య 18వ వసంతంలోకి ...

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

గురువారం | 30 జనవరి 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 99
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మాఘ మాసం శు.పాడ్యమి సా.5.47, శ్రవణం ఉ.8.51, వర్జ్యం మ.12.44 నుంచి 2.17 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 10.58 వరకు తిరిగి మ.2.37 నుంచి 3.21 వరకు



# కుంభమేళాలో తొక్కిసలాట

మేళాలో మృతుల సంఖ్య **30**

- యూపీ ప్రభుత్వ ప్రకటన
- మహా కుంభమేళాలో విషాద ఘటన
- తొక్కిసలాటలో ప్రాణనష్టం
- ప్రెస్ మీట్‌లో వివరాలు తెలిపిన డీఐజీ
- మహా కుంభమేళా తొక్కిసలాట విచారకరం
- పెద్ద కార్యక్రమంలో చిన్న సంఘటనలు సహజం : యూపీ మంత్రి
- తొక్కిసలాట ఘటనను సీఎం సీరియస్‌గా తీసుకున్నారన్న మంత్రి
- వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- భక్తుల మృతి విచారకరమన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామన్న సీఎం
- తొక్కిసలాట ఘటన కలిచివేసిందన్న హరీశ్ రావు

యూపీ మహా కుంభమేళాలో ఏం జరుగుతోంది? ఎందుకు అపశృతి చేటు చేసుకుంది? అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందా? మిడ్ నైట్ రెండున్నర గంటల సమయంలో ఘటన ఎలా జరిగింది? దీనిపై ప్రభుత్వ వర్గాలు ఏమంటున్నాయి? ఇవే ప్రశ్నలు చాలామంది భక్తులను వెంటాడుతున్నాయి. మహా కుంభమేళాలో అపశృతులు కంటిన్యూ అవుతున్నాయి. మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 20 మంది భక్తులు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ మేరకు పలు జాతీయ ఛానెళ్లు ప్రకటించాయి.

6లో

### అమెరికాలో ప్రభుత్వ
# ఉద్యోగాల్లో కోత

**బాధ్యతలు తీసుకున్నాక ట్రంప్ తొలి అడుగు**

అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ట్రంప్ సర్కారు బైఅవుట్‌ను ప్రకటించింది. ఈమేరకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి ఒక మెమో వెలువడింది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలు, ప్రవర్తన, అనుకూలతలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు.




6లో

### పీజీ మెడికల్ సీట్లపై
# సుప్రీం సంచలన తీర్పు

- పీజీ మెడికల్ సీట్లలో రాష్ట్రాల కోటా చెల్లదని సుప్రీం ఉత్తర్వులు
- రాష్ట్ర కోటాలో నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని వెల్లడి
- రాష్ట్ర కోటా సీట్లను నీట్ మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని తీర్పు

వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది.



2లో

మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది.

### లాభాల్లో స్టాక్
# మార్కెట్‌లు



5లో

- రోజు మొత్తం లాభాల్లో కొనసాగిన మార్కెట్లు
- 631 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 205 పాయింట్లు లాభపడ్డ నిఫ్టీ

### తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ
# ఎన్నికల షెడ్యూల్




2లో

ఏపీ, తెలంగాణలో మూడు చొప్పున ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహించి..మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### ఇంటింటి సమగ్ర సర్వే
# సక్సెస్

రెండు రోజుల్లో ముసాయిదా నివేదిక

- ఫిబ్రవరి 2న కేబినెట్ సబ్ కమిటీకి తుది నివేదిక
- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ
- అధికారులు, ఉద్యోగులను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



3లో

రాష్ట్రంలో విజయవంతంగా పూర్తయిన సమగ్ర కుల గణన పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే పై ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు.

### కృత్రిమ మేధతో ఇందిరమ్మ
# ఇండ్ల పథకం



3లో

- మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### పంచాయితీ ఎన్నికలపై
# ప్రభుత్వం తర్జన భర్జన

- కులగణను సంబంధించిన ముసాయిదా సిద్ధం
- ఇంకా ఫైనల్ రిపోర్టును ఇవ్వని డెడికేషన్ కమిషన్
- ఫిబ్రవరి 2 లోపు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని తెలిపిన డెడికేషన్

..3లో

### కేటీఆర్, హరీశ్‌రావులపై
# కోమటిరెడ్డి ఫైర్

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్రావు లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీభవన్ లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తన కాలి గోటికి కూడా సరిపోరని, కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.



3లో

## సీఎంకి, బండి బహిరంగ లేఖ



3లో

- రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇండ్లు రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి
- 26 నుంచి అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు : బండి

## అంతా ఇంతే!




విపక్షాల కుట్ర అని చెప్పేద్దాం

### తెలంగాణలో దూసుకెళ్తున్న
# బీసీ వాదం



3లో

తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమం దూసుకెళ్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా స్థానిక సంస్థలు 42 శాతం రిజర్వేషన్లు ఎలక్షన్ లే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని వర్గాలు పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం పెద్దన్న పాత్ర పోషిస్తుంది. ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలను సమయత్వం చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. బీసీ మేధావులను సమాజానికి పరిచయం చేస్తే ప్రభుత్వాలు బీసీలకు చేసిన అన్యాయంపై ప్రశ్నిస్తున్నారు.

- బీసీ ఉద్యమంలో కీలక భూమిక పోషిస్తున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం
- బీసీ హక్కులపై గర్జిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- సభలు సమావేశాలతో ఆలోచన రేకెత్తిస్తున్న కటకం నర్సింగరావు
- రౌండ్ టేబుల్ సమావేశాలలో ముందున్న బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు
- పట్టణాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి
- తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో ముందుకు
- సామాన్యుడు నుండి ఐఏఎస్ వరకు, కవి నుండి కళాకారుని వరకు
- ఆలోచన వేదికలు, సభలు, సమావేశాలు సైకిల్ యాత్రలు, పాదయాత్రలు,

### ఉత్తమమైనది విద్య
# చదువుతోనే విజ్ఞానం

- విద్యను ఎవరూ దోచుకోలేరు.. దాంతో విజ్ఞానం పెరుగుతుంది
- మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలి : మంత్రి సీతక్క

జీవితంలో అన్నింటికంటే ఉత్తమమైనది విద్య అని, విద్యతోనే వికాసం సాధ్యపడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు లక్డికాపూల్ లోని ఎఫ్టీసీసీఐ కార్యాలయంలో విద్యాధన్ స్వచ్ఛంద సంస్థ స్కాలర్ షిప్ ల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోటే అభివృద్ధి సాధ్యమని చెప్పారు.



3లో




● జాతీయ సర్వే సంస్థ 'అసర్' నివేదిక వెల్లడి ● మంత్రి లోకేష్ వ్యాఖ్య

# జగన్ రెడ్డి పాలనలో నీరుగారిన విద్యావ్యవస్థ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జగన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం జాతీయ సర్వే సంస్థ 'అసర్' నివేదికతో బయటపడిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. జగన్.. ప్రచారానికి మేనమామ, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైందని ధ్వజమెత్తారు. పబ్లిసిటీ కోసం రూ. వందల కోట్లు ఖర్చు చేశారు తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. 2018లో తెదేపా హయాంలో మెరుగ్గా ఉన్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు.. వైకాపా పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదికలో స్పష్టంగా వెల్లడించిందన్నారు.అడ్డగోలుగా జీవోలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు.. తగ్గిన హాజరు శాతం, తాగునీరు, మరుగుదొడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం.. ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయని మండిపడ్డారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేని పరిస్థితి నెలకొందన్నారు. విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఏడు నెలలుగా అనేక చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. నిరంతరం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు తెలుసుకుంటూ అనేక మార్పులకు నాంది పలికానని వెల్లడించారు. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందించి ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోబోతున్నామన్నారు.

# నేటి నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

● మొదటి దఫాలో పౌరులకు అందుబాటులోకి 161 సేవలు ● వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించనున్న మంత్రి నారా లోకేశ్ ● గతేడాది మెటాతో ఒప్పందం ● వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వాట్సాప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం రేపటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో సీఎం సమీక్షించారు. మొదటి విడతగా పౌరులకు 161 సేవలను ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను పొందాలనుకునే వారు ఏ విధంగా ఆప్షన్‌లను ఎంచుకుంటారనే దానిపై సీఎంకు అధికారులు వివరించారు. రెండవ విడతలో మరిన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. మొదటి విడతలో భాగంగా దేవాదాయ, ఎనర్జీ, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ వంటి వివిధ శాఖల్లో సుమారు 161 సేవలను ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొదటి సారి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్నామని, ధృవపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అదేవిధంగా పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, ఆ దిశగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసుకుంది.

ఆంధ్రప్రదేశ్‌ను డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం సులభతరం కానుంది. రేపు వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు



● స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ● 10.80 ఎకరాల్లో పార్కు ఏర్పాటు ● 365 రోజులూ నేతన్నలకు పని కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మంగళగిరిలోని ఆటో నగర్ ను ఆనుకుని మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత కార్మికులకు 365 రోజులు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ఆ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బుధవారం మంగళగిరిలోని ఆటోనగర్ కు ఆనుకుని ఉన్న 10.80 ఎకరాలను చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన అయిదేళ్లు చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాలు విక్రయించే మార్కెట్ సదుపాయం లభించకపోవడంతో, ఎందరో నేతన్నలు అప్పుల పాలయ్యారన్నారు. కొందరు చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని విచారం వ్యక్తంచేశారు. టీడీపీ పాలనలో చేనేతలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయం చేనేతకు స్వర్ణయుగమన్నారు. 2014-19లో చేనేతల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నూలు కొనుగోలుకు రాయితీ అందజేశారని, ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారని మంత్రి గుర్తు చేశారు. వాటితో పాటు ముద్ర రుణాలతో పాటు త్రిఫ్ట్ పథకం అమలు చేశారన్నారు. ఆనాటి ప్రయోజనాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను నేతన్నలకు అందివ్వాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ నిర్ణయించారని మంత్రి తెలిపారు.

**చేనేతలకు 365 రోజుల పనే లక్ష్యం**

నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు,మంత్రి లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వపరంగా ఆర్థిక దన్ను అందించడంతో పాటు 365 రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేసి, చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో నూతన టెక్స్ టైల్స్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలతో పది నూతన క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ పార్కుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖలో 5 ఎకరాల్లో యూనిటీ మాల్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

**మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు**

మంగళగిరిలోని ఆటో నగర్ లో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. 10.80 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తమిళనాడులోని కంచి తరహాలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 365 రోజుల పాటు చేనేత కార్మికులకు పని కల్పించాలన్న లక్ష్య సాధనలో భాగంగానే ఈ హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత జౌళి శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి 7 నెలల్లో భారీ పెట్టుబడులు

● రాష్ట్రానికి గత 7 నెలల్లో రూ. 6.33 లక్షల కోట్ల పెట్టుబడులు ● మంత్రి పార్థసారధి వెల్లడి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేయాగా సియం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరలా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పెద్దఎత్తున కృషి చేయడం జరుగుతోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి వెల్లడించారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడూ రాష్ట్రాభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకు వెళ్ళేందుకు గత ఏడు నెలల్లో రాష్ట్రానికి రూ.6.33 లక్షల కోట్ల రూ.ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకోవడం జరిగిందని తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు. ముఖ్యంగా విశాఖలో టిసిఎస్,ఎన్టిపిసి,ఆర్సెలర్ మిట్టల్, హెచ్ పి సి, రిలయన్స్ వంటి కంపెనీలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నాయని చెప్పారు.గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను తెల్సుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నీతిఆయోగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదని ఖండించారు.ఒక వ్యక్తి మూర్ఖత్వ పాలనతో ఏరాష్ట్రమైనా దేశమైనా ఏవిధంగా నష్టపోతుందనేకు గత ప్రభుత్వ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. అంతేగాక రాష్ట్రానికి ఆదాయాన్ని పెంపొందించాల్సిన వారు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేసి సుమారు 10 లక్షల రూ.ల అప్పుల ఊబిలోకి నెట్టేసారని మంత్రి పార్థసారధి అన్నారు. గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీఇంబర్సుమెంట్ కు సంబంధించి రూ.2800 కోట్లు, అంగన్ వాడీల్లో చిన్న పిలల్లకు అందించే చిక్కీలు,గ్రుడ్లుకు సంబంధించి రూ.1700 కోట్లు, ఉద్యోగులకు సంబంధించి రూ.20వేల కోట్లు బకాయిలు చెల్లించలేదని వివరించారు.అదే విధంగా గృహ నిర్మాణానికి సంబంధించి రూ.7వేల 800 కోట్లు,ఉపాధి హామి పథకానికి రూ.2100 కోట్లు బకాయిలు పెట్టివెళ్ళిందన్నారు.అంతేగాక ఆరోగ్యశ్రీకి సంబంధించి కూడా పెద్దఎత్తున బకాయిలు చెల్లించలేదని తెలిపారు.రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించ లేదని చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో వ్యవసాయ రంగం మొత్తం కుదేలైందని,గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులన్నిటీ ఎక్కడికక్కడే నిలిపే వేయడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కు జీవనాడైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఈకూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు రూ.15వేల కోట్లను కేంద్రం నుండి మంజూరు చేయించుకోగలిగామని తెలిపారు. అమరావతి రాజధాని పనులన్నిటనీ గత ప్రభుత్వం పూర్తిగా ప్రక్కన పెట్టి పూర్తిగా నిర్లక్ష్యం చేయడమేగాక మూడు రాజధానుల పేరిటి నాటకమాడుతూ అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేసిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.కాని ఈకూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన 7 మాసాల్లోనే ప్రపంచ బ్యాంకు, హడ్కో,జైకా తదితర సంస్థల ద్వారా 31వేల కోట్ల రూ.లను సాధించుకోగలిగామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మరో పెద్ద హామీ అయినా దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం జరుగుతోందని దానివల్ల 90 లక్షల మందికి లబ్ది చేకూరుతోందని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పూర్తి కాని,మరమ్మత్తులు చేయలేని గ్రామ,పట్టణ, రాష్ట్ర రహదారులను పూర్తి చేసి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందిస్తు న్నామని చెప్పారు. ఓ వైపు అప్పుల కుప్ప, మరో వైపు గత ప్రభుత్వ బకాయిల తట్ట దర్శనమిస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందీ ఈ ప్రభుత్వమన్నారు.1000 పెన్షన్‌ను పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే రూ.3 వేలు ఉన్న సామాజిక పెన్షన్‌ను రూ.4 వేలు చేశారన్నారు.ఇచ్చిన హామీ మేరకే ప్రతీ నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు..ప్రతీ ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చి ఒక్క ఏటా కూడా డీఎస్సీని పూర్తి చేయకుండా హామీని గాలికి వదిలేశారని కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ ఫైళుపై సంతకం చేశారని గుర్తు చేశారు.పేదవానికి అన్నం పెట్టే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసివేస్తే ఈప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని వునరుద్ధరించడం జరిగిందని మంత్రి పార్థసారధి చెప్పారు.

# సింహాచలం పంచ గ్రామాల సమస్యకు పరిష్కారం

● పంచ గ్రామాల్లోని 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయం ● 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు సంసిద్ధం ● రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయం ● రాష్ట్ర రెవిన్యూ, రిజిసేట్రషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎంతో కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న సింహాచలం పంచ గ్రామాల సమస్యకు త్వరలో ప్రభుత్వం పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో రాష్ట్ర సచివాలయంలో నేడు జరిగిన సమావేశంలో ఈ సమస్యకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో విశాఖపట్నానికి చెందిన పలువురు శాసన సభ్యులతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పంచగ్రామాల్లోని 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకై ప్రత్యామ్నయంగా దాదావు రూ.5,300 కోట్ల విలువ చేసే 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సింహచల దేవ స్థానం అనువంశిక ధర్మకర్త అయిన శ్రీ వూసపాటి అశోక్ గజపతిరాజు కూడా ఆమోదాన్ని వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యకు సంబంధించి గతంలో ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.పై పలువురు కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ కేసులను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు జి.ఓ.నెం. 338, 296 లను ను జారీ చేశామన్నారు. ఈ జీవోల కింద విశాఖలో 70 వేల మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ జి.ఓల ప్రకారం రెండేళ్ల కాల వ్యవధిలో ఆ భూములపై లబ్ధిదారులకు అన్ని హక్కులు సంప్రాప్తం అయ్యే విధంగా కన్వేయన్సు డీడ్ కూడా ఇవ్వాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం ఆ జి.ఓలను పట్టించుకోకుండా లబ్ధిదారులకు న్యాయం చేసే విధంగా స్పందించ లేదన్నారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అందుకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

అయితే జి.ఓ.ను 2017 జారీ చేసిన నేపథ్యంలో అప్పటి నుండే ఈ భూములను క్రమబద్ధీకరించాలని, అప్పటి నుండి రెండేళ్ల కాలవ్యవధి పూర్తి అయిన వాటికి కన్వేయన్సు డీడ్లును కూడా జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే విధంగా రైతులు సాగు చేసుకునే భూములు, కొన్ని కాళీ స్థలాలకు సంబందించి కోర్టులో పలు కేసులు ఉన్నందున, వాటిని కూడా పరిష్కరించరించేందుకు దశల వారీగా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. యు.ఎల్.సి.లోని అదనపు భూములు ఏవైనా ఆక్రమణకు గురైనా, వాటిని పి.ఓ.టి. చట్టం ప్రకారం పదేళ్ల కాల వ్యవధిలో అలియనేట్ చేయాల్సి ఉందని, అయితే అటు వంటి భూములకు కూడా రెండేళ్ల కాలవ్యవధిలోనే కన్వేయన్సు డీడ్లును ఇచ్చేందుకు ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గాజువాక ఇనాం భూముల క్రమబద్ధీకరణకు సంబందించి తమ ప్రభుత్వం 2018లో జి.ఓ.నెం.301 ను జారీచేయగా ఆ జి.ఓ. ప్రకారం దాదావు 7 వేల మంది ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ ప్రక్రియ కూడా పూర్తి కాకుండా అపరిష్కృతంగా ఉన్నందున, తిరిగి ఆ జి.ఓ.ను కూడా సవరించి నూతన మార్గదర్శకాలతో నూతన జి.ఓ.ను జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం భూమి సుమారు 420 ఎకరాలు ఆక్రమణకు గురై వాటిలో దాదావు 12,149 ఇళ్లను నిర్మించుకోవడం జరిగిందన్నారు. అయితే ఆ ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు గతంలో తమ ప్రభుత్వం జి.ఓ.నెం.229 నూ జారీ చేస్తూ 420 ఎకరాల ప్రభుత్వ భూమిని మరో చోట ఇచ్చేందుకు, క్రమబద్ధీకరణ క్రింద వచ్చే ఫీజను కూడా దేవస్థానానికి ఇచ్చేందుకు నిర్ణయించండమైందన్నారు. అయితే ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి విలువకు తగిన భూమిని ఇవ్వాలని కోరుతూ కొంత మంది కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీని రిజిస్ట్రేషన్ విలువ దాదావు రూ.5,300 కోట్ల వరకూ ఉందన్నారు. పెదగంట్యాడ, గాజువాక, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నామన్నారు. దేవస్థానానికి అవసరమైన చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నామన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కోర్టులో కౌంటరు ఫైల్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రెండు మూడు మాసాల్లో ఈ సమస్యకు ఒక పరిష్కార మార్గం దొరుకుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గాజువాకలో ఇనాం భూమిని క్రమబద్ధీకరించేందుకు కూడా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూముల క్రమ బద్ధీకరణకు సంబందించి 2015-16 సంవత్సరంలో జి.ఓ. నెం. 301 ను జారీ చేయడం జరిగిందని, దాని కట్ ఆఫ్ తేదీ 2017 తో ముగిసిందన్నారు. అయితే ఆ కట్ ఆఫ్ తేదీని 31.12.2023 వరకూ పొడిగస్తూ నూతన జి.ఓ. ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందు వల్ల మరో ఆరు వేల మందికి లబ్ది చేకూరే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## మహా కుంభమేళాలో తొక్కిసలాట దురదృష్టకరం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 20 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. . దురదృష్టకరమైన ఘటన ఇదని పేర్కొన్నారు. మౌని అమావాస్య సందర్భంగా వుణ్య స్నానాలు ఆచరించాలని కోట్ల మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరం. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్ళేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సాంస్కృతిక వారసత్వానికి సజీవ సాక్ష్యాలు ఏటికొప్పాక బొమ్మలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్య్ పథ్ లో నిర్వహించిన పరేడ్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటం మూడవ స్థానంలో నిలవడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. అధ్యాత్మిక భావంతో పాటు రాష్ట్ర సంస్కృతిక వైభవాన్ని చాటేలా తీర్చిదిద్దిన శకటం దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ప్రజల మనసును దోచుకోవడం సంతోషానిచ్చిందన్నారు. శకటం ముందు పర్యావరణ హితంగా, సహజసిద్ధమైన వనరులతో సృజనాత్మకంగా తయారు చేసిన వినాయకుడు, చివర ఎత్తైన శ్రీ వేంకటేశ్వరస్వామి రూపాలు, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టును ప్రతిబింబించేలా బొమ్మల కొలువు, శకటం ప్రాధాన్యతను వివరిస్తూ కళాకారులు, చిన్నారుల నాట్యం పలువురిని ఆకట్టుకోవడంతో 3వ స్థానంలో నిలిచామని వివరించారు. కూటమి ప్రభుత్వ హస్తకళలకు ప్రాధాన్యతనిస్తోందని, విస్తృతంగా ప్రచారం సైతం కల్పిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఏటికొప్పాక బొమ్మల శకటం తయారు చేసిన, హస్తిన వేదికపై ప్రదర్శించిన బృందానికి ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. అదే విధంగా తొలి స్థానంలో నిలిచిన యూపీ మహాకుంభ్ శకటం, రెండో స్థానంలో త్రివుర రాష్ట్ర శకటం రూపకర్తలకు అభినందనలు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ, తెలంగాణలో మూడు చొప్పున ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహించి..మార్చి 3న ఓట్ల లెక్కింవు చేపట్టనున్నారు. ఏపీలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ స్థానానికి పోలింగ్ జరగనుంది.

## తప్పుడు వార్తలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతా




ఏపీ స్టేట్ భ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తనపై కొందరు మీడియా ప్రతినిధులు తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్తలు రాస్తున్నారని మాజీ మంత్రి, గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండిపడ్డారు. నిరూపించే దమ్ము ఉంటేనే వార్తలు రాయాలని నిరూపించలేకపోతే రైలు పట్టాలపై పడుకోబెడతానని హెచ్చరించారు. ఎవడో డబ్బులు ఇస్తాడని తప్పుడు వార్తలు రాస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను భూకబ్జాలకు పాల్పడ్డానని, నియోజకవర్గంలో తన కుటుంబ పెత్తనం ఉందంటూ కొందరు తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని వారంతా పద్ధతి మార్చుకోవాలని అన్నారు. గుంతకల్లు పట్టణ శివారులోని దోనిముక్కలలో జయరాం పర్యటించారు. అక్కడ ఉన్న లేఔట్ లో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యల గురించి ఆయన ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న వారిపై ఆయన నిప్పులు చెరిగారు. డబ్బులకు ఆశపడి తప్పుడు వార్తలు రాయొద్దని హెచ్చరించారు.

## పీజీ వైద్య విద్యలో నివాసిత ఆధారిత కోటా రద్దు



ఏపీ, స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింవులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. మనమంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం కాబట్టి ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా అని ధర్మాసనం వెల్లడించింది. నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే అని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది.

## బెయిల్‌పై విడుదలైన నందిగం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ పార్టీ మాజీ ఎంపీ నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలు నుంచి నేటి ఉదయం విడుదల్యారు.. హ్యా కేసులో అరెస్టై 145రోజుల పాటు జైలులో ఉన్నారు.. అత్డికి సుప్రీంకోర్టు మంగ్యారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో నేడు 10వేల రూపాయిలు వూచికత్తు జైలు అధికారుల్కు స్మించి విడుదల్యారు. జైలు నుంచి విడుదలైన అత్డికి ఘన స్వాగతం పలికారు వైసీపీ నేతలు, ఆయన అనుచరులు. కాగా, కాలర్ బోన్ నొప్పితో బాధపడుతున్న ఆయ్న గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన తర్వాత్ నేరుగా అంబులెన్స్ లో విజ్యాడుకు. అక్క ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు.



## కృత్రిమ మేధతో ఇందిరమ్మ ఇండ్ల పథకం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావులేకుండా లబ్దిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం నాడు మంత్రిగారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక నుండి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేవరకూ కృత్రిమ మేధస్సు ( ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్- ఎఐ) వాడుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక యాప్ను రూపొందించి సర్వే నిర్వహించడం జరిగిందని ఇండ్ల నిర్మాణం, చెల్లింపులలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా రోజువారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేలా ఏఐని ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిజమైన నిరుపేదలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు.

మొబైల్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత కృత్రిమ మేధస్సు (ఏ.ఐ) టెక్నాలజీతో సరిపోలుస్తూ అనర్హులను గుర్తించి అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని, ఈ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించేలా ఏఐ టెక్నాలజి ని వాడుకోవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా, ఇతర ప్రభావిత విభాగాల జోక్యం లేకుండా లబ్దిదారుల ఎంపిక జరిగేలా ఈ విధానాలు సహకరిస్తాయని, అనర్హులు ఎవరైనా ఉంటే పూర్తిగా గుర్తించే అవకాశాలు ఈ నూతన సాంకేతిక విధానం వలన సాధ్యపడుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 4 ప్రతిష్టాత్మక పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. దీనిలో తొలి విడతగా నివాస స్థలం కలిగిన 72 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేయడం జరిగిందని ఈ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్



## రెండు రోజుల్లో ముసాయిదా నివేదిక

● ఫిబ్రవరి 2న కేబినేట్ సబ్ కమిటీకి తుది నివేదిక ● దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ● అధికారులు, ఉద్యోగులను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్రంలో విజయవంతంగా పూర్తయిన సమగ్ర కుల గణన పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే పై ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు.

బుధవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్ కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని అన్నారు.

సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందని, ఒకటి రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీ లోగా కేబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నవంబర్ 6వ తేదీన రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే 2024) మొదలైంది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలో సర్వే పూర్తయింది. ప్రణాళిక విభాగం అధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దాదావు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నారు.

రాష్ట్రంలోని దాదావు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించింది. ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదావు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయవంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి. కొన్ని చోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదదని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

రికార్డు వేగంతో కుల గణన

అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. సెప్టెంబర్ 12వ తేదీన ఇంటింటి సర్వే కుల గణన చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటయిన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది. అక్టోబర్ 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు. అక్టోబర్ 10వ తేదీన ప్రణాళిక విభాగం సర్వేకు సంబంధించిన పూర్తి విధి విధానాలతో జీవో నెం.18 జారీ చేసింది.

## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: భూమికి, విత్తనానికి మధ్య ఎలాంటి బంధం ఉందో.. రైతులతో కాంగ్రెస్ పార్టీకి అలాంటి బంధమే ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీని కూడా ఏకకాలంలో చేయలేదని.. తద్వారా రైతులపై రూ.11,145 కోట్ల మేర వడ్డీ భారం పడిందన్నారు. గతంలో నాట్లు వేసే సమయం కాదు.. కోతల సమయానికి కూడా రైతుబంధు అందించలేదని విమర్శించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో రూ.72 వేల కోట్ల (35 శాతం) నిధులు వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించినట్లు తుమ్మల చెప్పారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రైతులు పడిన ఇబ్బందులు గమనించాం. వారి కన్నీరు తుడవడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశాం. వరికి బోనస్.. మా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. సాగు చేసే రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు ప్రారంభించాం. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నాం. రైతును రాజును చేసేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయి అని పేర్కొన్నారు.

## మహాకుంభమేళాలో తొక్కిసలాటపై మంత్రి దిగ్భ్రాంతి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః ప్రయాగ్ రాజ్‌లోని మహాకుంభ మేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన పట్ల మంత్రి సురేఖ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు, మరికొందరు గాయాలపాలు కావడం పట్ల మంత్రి సురేఖ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. 70 ఏళ్ళ క్రితం ప్రయాగ్ రాజ్ లో జరిగిన కుంభమేళాలో మౌని అమావాస్య రోజునే జరిగిన తొక్కిసలాటలో వందల సంఖ్యలో భక్తులు మరణించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేసుకున్నారు. ఈ ప్రమాదాన్ని దురదృష్టకర సంఘటనగా మంత్రి సురేఖ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వసంత పంచమి, అచల నవమి, మహాశివరాత్రి వంటి ముఖ్యమైన రోజులున్నందున మహాకుంభమేళాకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చే పరిస్థితుల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సురేఖ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు మంత్రి సురేఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయాలపాలైన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఉత్తమమైనది విద్య
# చదువుతోనే విజ్ఞానం

● విద్యను ఎవరూ దోచుకోలేరు.. దాంతో విజ్ఞానం పెరుగుతుంది

● మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలి : మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః జీవితంలో అన్నింటికంటే ఉత్తమమైనది విద్య అని, విద్యతోనే వికాసం సాధ్యపడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు లక్డికాపూల్ లోని ఎఫ్టీసీసీఐ కార్యాలయంలో విద్యాధన్ స్వచ్ఛంద సంస్థ స్కాలర్ షిప్ ల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోటే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం తెచ్చి 6-14 సంవత్సరాల మధ్య పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశ పెట్టింది.. విద్యను ఎవరు దోచుకోలేరు, విద్య పంచుకుంటేనే విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు..

ఆ ఉద్దేశంతో విద్యాధన్ ఫౌండేషన్ పని చేయడం అభినందనీయం అని చెప్పుకొచ్చారు. మీ ప్రయత్నాలకు మా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క వెల్లడించారు. ఇక, విద్య ద్వారానే నా లైఫ్ ఈ స్థాయికి వచ్చిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నేను టెన్త్ క్లాస్ వరకు చదువుకున్న తర్వాత పదేళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపాను.. బయటకొచ్చిన తర్వాత తిరిగి విద్యార్థిగా చదువును కొనసాగించానని తెలిపారు. చదువుకోవాలన్న పట్టుదలతో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశాను అని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నా విద్యను ఆపలేదు.. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎంఏ కోర్సును జాయిన్ అవ్వాలనుకుంటున్నాను.. అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పది, జ్ఞానాన్ని లక్షల మందికి పంచడం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేసిన వాళ్లమవుతామని ఆమె వెల్లడించారు. విద్యాభివృద్ధిలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నాయి..

ఆ అంతరాలను తొలగించే దిశలో అంతా కలిసికట్టుగా పని చేయాలి.. మారిన పరిస్థితుల్లో మానవ సంబంధాలు బలహీన పడుతున్నాయి.. మానవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలని పిలువునిచ్చారు. పేదలకు విద్య అందించే విద్యాధన్ ఫౌండేషన్కు మా ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.

## పంచాయితీ ఎన్నికలపై ప్రభుత్వం తర్జన భర్జన

● కులగణను సంబంధించిన ముసాయిదా సిద్ధం ● ఇంకా ఫైనల్ రిపోర్టును ఇవ్వని డెడికేషన్ కమిషన్ ● ఫిబ్రవరి 2 లోపు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని తెలిపిన డెడికేషన్

తెలంగాణ బ్యూరో ప్రతినిధిః పంచాయితీ ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం తర్జనభర్జనకు గురవుతోంది. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణకు వెళ్లాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 2లోపు డెడికేషన్ కమిషన్ రిపోర్టు ఇవ్వనుంది. రిపోర్టు వచ్చిన తర్వాత మరోసారి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఫిబ్రవరిలోనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రేవంత్తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే గురించి చర్చించారు. ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను సీఎం అభినందించారు. అయితే ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. కానీ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం తర్జన భర్జనకు గురవుతోంది. కులగణను సంబంధించిన ముసాయిదా సిద్ధమైనప్పటికీ ఇంకా ఫైనల్ రిపోర్టును డెడికేషన్ కమిషన్ ఇవ్వలేదు. ఫిబ్రవరి 2 లోవు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని డెడికేషన్ కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2 తరువాత మరోసారి సమావేశమై పంచాయతీ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. రిజర్వేషన్లపై పాత పద్ధతిలోనే వెళ్లాలా లేక న్యాయ స్థానాలలో పెంచుకునే అవకాశం పొందాలా అనేదానిపై సర్కార్ తర్జన భర్జనకు గురవుతోంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి 1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో ఎలక్షన్స్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు.


### బహిరంగ ప్రకటన

2017 నవంబర్ 12న జరిగిన వార్షిక జనరల్ బాడీ సమావేశం ప్రకారం, రాంకీ పీర్ల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (RPOWA)కు ఏకైక మధ్యవర్తిగా న్యాయ వాది శ్రీ సి.వి. నారాయణరావు నియమితులయ్యారని సంబంధిత అందరికీ తెలియజేయడమైనది. అందువల్ల, ప్లాట్/ విల్లా యజమానుల నుండి M/s. రాంకీ పీర్ల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నిర్వహణ ఛార్జీలు మరియు కార్పస్ ఫండ్‌కు చెల్లించాల్సిన మొత్తాలకు సంబంధించి ఆయన మధ్యవర్తిత్వ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. 1. శ్రీ. సిహెచ్. శ్యామ్ సుందర్ రెడ్డి, 2. శ్రీమతి ఉడుముల జ్యోతి, 3. శ్రీమతి ఇ. రమా దేవి, 4. శ్రీ సిహెచ్. అశోక్ రెడ్డి, 5. శ్రీ కుడుముల ప్రభాకర్ రెడ్డి, 6. శ్రీ కుడుముల ప్రదీప్ కుమార్ రెడ్డి, 7. శ్రీ యెల్లయ్య, 8. శ్రీ రవి కుమార్ రెడ్డి, 9. శ్రీ శ్రీనివాస్, 10. శ్రీ ధన్‌పాల్ నవీన్ చందర్. రాంకీ పీర్ల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రచురణ తేదీ నుండి 15 రోజుల్లోపు మధ్యవర్తిత్వాన్ని కొనసాగిస్తుందని మరియు మధ్యవర్తిత్వం యొక్క ఫలితం తుది మరియు పార్టీలపై కట్టుబడి ఉంటుందని డిఫాల్టర్లకు తెలియజేయడానికి ఈ పబ్లిక్ నోటీసు జారీ చేయబడింది.

కార్యదర్శి - **రాంకీ పీర్ల్ యజమానులు సంక్షేమ సంఘం** ఆర్డర్ ద్వారా


## సీఎంకి బండి బహిరంగ లేఖ
# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

● రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇండ్లు రేషన్ కార్డులు మంజూరు చేయాలి

● 26 నుంచి అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:రాష్ట్రంలోని అర్హులందరికీ రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇండ్లు, రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని అర్హులైన వారందరికీ రైతుభరోసా, ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలను జనవరి 26 నుండి అమలు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అందులో 3 శాతం మందికి కూడా నేటికీ లబ్ది చేకూర్చకపోవడం అత్యంత బాధాకరం. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఏటా 20 వేల కోట్ల రూపాయలను జమ చేస్తామని మీరే స్వయంగా హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని 10 లక్షల మంది వ్యవసాయ కూలీల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ప్రతి ఏటా 12 వేల రూపాయల చొప్పున జమ చేస్తామని బహిరంగ సభల్లోనే భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కొత్తగా 40 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్నబియ్యం కూడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అట్లాగే ఈ ఏడాది నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. ఇవన్నీ జనవరి 26 నుండే అమలు చేస్తామని, ఈనెలాఖరుకల్లా ఆయా రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులను కూడా జమ చేస్తామని వాగ్దానం చేశారు. కానీ మీరు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేకపోయారు. రాష్ట్రంలో 12,991 గ్రామ పంచాయతీలుండగా, మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను మాత్రమే ఎంపిక చేసి పైన పేర్కొన్న నాలుగు పథకాల లబ్ది దారులను గుర్తించి వాటికి సంబంధించి మంజూరు పథకాలను మంజూరు చేయడం విస్మయం కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మంది అర్హులైన రైతులుంటే, నేటి వరకు 4,41,911 మంది రైతుల ఖాతాల్లోనే ఎకరాకు రూ.6 వేల చొప్పున జమ చేయడం బాధాకరం. అట్లాగే వ్యవసాయ భూమిలేని 10 లక్షల మంది కూలీల కుటుంబాల బ్యాంకుల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చిన మీరు నేటి వరకు 20 వేల 336 మంది ఖాతాల్లోనే డబ్బులు జమ చేశారు. మిగిలిన 9 లక్షల 79 వేల మందికిపైగా కూలీలకు రైతు భరోసా పైసలే ఇవ్వకపోవడం దుర్మార్గం.

రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం...నిన్నటి వరకు 42 వేల 267 మందిని మాత్రమే గుర్తించడం విస్మయం కలిగిస్తోంది. అంటే 99 శాతం మంది అర్హులకు నేటికీ రేషన్ కార్డులు అందలేదని మీ గణాంకాలు చెబుతున్నాయి.

అట్లాగే రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల కోసం అందిన 70 లక్షలకు పైగా దరఖాస్తుల్లో... దాదావు 40 లక్షల మంది పేదలు ఇండ్లకు అర్హులని తేలింది. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ లో 10 లక్షల కుటుంబాలకు, ఇతర ప్రాంతాల్లో 30 లక్షల కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం... నేటి వరకు 72 వేల 406 మందికి మాత్రమే ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మొత్తంగా పై నాలుగు పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా తేల్చిన కుటుంబాల్లో 3 శాతం మందికి కూడా నేటి వరకు లబ్ది చేకూర్చకపోవడం సిగ్గు చేటు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రులు ప్రజలకు ఒక మాట ఇచ్చారంటే అదే శాసనంగా అమలయ్యేది. కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక సీఎం పదవి చేపట్టిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గానీ, ప్రస్తుత ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మీరు గాని ఏనాడూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోవడం బాధాకరం. ఈ విషయంలో మీరు అనుసరిస్తున్న వైఖరి ముఖ్యమంత్రి పదవికే కళంకం తెచ్చేదిగా ఉంది. సీఎం హోదాలో ఉంటూ మీరు ఇస్తున్న హామీలనే అమలు చేయలేకపోతే, మీ ఆధ్వర్యంలో పనిచేసే అధికారులు ఏ విధంగా జవాబుదారీ తనంతో పనిచేయగలరో ఒకసారి ఆలోచించండి. మీ తప్పుడు హామీలను నమ్మి అవి అమలు కాక తెలంగాణ ప్రజలు తీరని ఆవేదనతో ఉన్నారు. పైగా ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన మాటను తప్పడమంటే మొత్తం తెలంగాణ సమాజాన్నే పలుచన చేయడమే అవుతుందని గుర్తుంచుకోవాలి.

వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినా నేటికీ వాటిని అమలు చేయడంలో మీరు దారుణంగా విఫలమయ్యారు. ఆశ్చర్యపోయే విషయమేమిటంటే ఈ ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్ లో రూ.7 వేల కోట్లకుపైగా నిధులు కేటాయించిన ప్రభుత్వం... నేటికీ అందులో నయాపైసా ఖర్చు చేయలేదు. ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వ హామీలకు, ఆచరణకు పొంతన లేదని, ముఖ్యమంత్రిగా మీరు ఇచ్చిన హామీలన్నీ డొల్ల అని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలో మీరే ఆలోచించండి. ఈ విషయంలో మీరు వ్యవహరిస్తున్న తీరు మీకు ముఖ్యమంత్రి పదవికి ఏ మాత్రం వన్నె తెచ్చేది కాదు.

ఇకనైనా మీరు 6 గ్యారంటీలతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అట్లాగే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇండ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈనెలాఖరులోగా అందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం. అట్లాగే లేనిపక్షంలో ప్రజా తిరుగుబాటు తప్పదని, జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని లేఖలో హెచ్చరించారు.

## కేటీఆర్, హరీష్‌రావులపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

● ఆ ఇద్దరూ తన కాలి గోటికి సరిపోరు ● మాజీ సీఎం కేసీఆర్‌లా ఎలక్షన్, కలెక్షన్ చేయలేదన్న మంత్రి



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్రావు లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీభవన్ లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్, హరీష్ రావులు తన కాలి గోటికి కూడా సరిపోరని, కేటీఆర్ పనికిరాని వ్యక్తి అని, పనికి రాని మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా.. బండి సంజయ్ ఉన్నరా.. అని ప్రశ్నించారు. గద్దర్కు అవార్డ్ ఇస్తే తప్పేంటని నిలదీశారు. కాంగ్రెస్ మీటింగ్లో పల్లీలు, ఐస్ క్రీంలు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ మీటింగ్కు రాలేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో టీ హబ్కు తాళం వేసిందే కేటీఆర్ అని అన్నారు. కేటీఆర్పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవని అన్నారు. కేసీఆర్ లా తాను ఎలక్షన్, కలెక్షన్ చేయలేదన్నారు. ప్రతిపక్ష నేత పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ కత్తులతో పొడుచుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా భట్టి పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని, కేసీఆర్ బడ్జెట్ సెషన్కు వస్తారో.. రారో చెప్పాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. చాల రోజుల గ్యాప్ తర్వాత ముఖాముఖీ కార్యక్రమం జరుగుతోంది. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుండి మంత్రి వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గాంధీ భవన్కు చాల మంది వస్తున్నారు. కాగా తెలుగు సినీ ఇండస్ట్రీకి తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం డబ్బింగ్ థియేటర్ నిర్వాహకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీ కళాకారులు, కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. దేశంలోనే తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, వాటిని మరింతమెరుగుపృుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సినిమా ఇండస్ట్రీని మరింత విస్తరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే వాటి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేంద్ర, సినీ నిర్మాతల మండలి ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, నల్గొండ డీసీఎంఎస్ చైర్మన్ బొల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్ - 22 శేరిలింగంపల్లి జోన్

టెండరు ప్రకటన

**టెండరు ప్రకటన నిట్ నెం.Engg-13/GHMC/PTC-C-22/2024-25,** **తేది: 28-01-2025**

**పని పేరు:** GHMC, శేరిలింగంపల్లి జోన్, సర్కిల్ - 22, రామచంద్రపురం, వార్డు నెం. 112 లోని మల్లికార్జున నగర్ పార్క్‌లో 1 నంబర్ మైనర్ మరియు ఫినిషింగ్ పనులు.. **అంచనా వ్యయం : 4.20 లక్షలు. బిడ్స్ స్వీకరణకు డౌన్‌లోడ్ ప్రారంభ/ఆఖరి తేది మరియు సమయం :** 30-01-2025 ఉ॥ 10.30 గం॥ల నుండి 05-02-2025 మ॥ 3.00 గం॥ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్ - 22, ఫోన్ నెం.: 9154167952. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.in పటాన్‌చెరు సర్కిల్-22 వద్ద చూడవచ్చును.

**DIPR.RO.No.9797-PP/CL/Advt/1/2024-25 , Dt: 29-01-2025**

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, SLP Zone, GHMC

సంపాదకీయం
editpage@suryaa.com

శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి నుండి జనవరి 29న తన 'వందవ ' ప్రయోగం జిఎస్ఎల్వి - ఎఫ్ 15 ద్వారా ఎన్విఎస్ - 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగి లోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరి వారంలో స్పేడెక్స్ మిషన్లో భాగంగా ప్రయోగించిన పిఎస్ఎల్వి సి-60 షార్ నుంచి చేసిన 99వ ప్రయో గం. తొలి ప్రయోగం చేసిన 46 ఏళ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతీ ఒక్కరూ అభినందనీయు లే! ఇది ప్రతీ భారతీయుని విజయం. ఈ సందర్భంగా ఒకసారి మన అంతరిక్ష విజయ పరంపరను పునరావలోకనం చేసుకుందాం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే దేశ రక్షణ అవసరాలు, అభివృద్ధికి అంతరిక్ష పరిజ్ఞాన అవసరాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనా వ్యవస్థను ఏర్పరచేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడయిన విక్రం సారాభాయ్ 1957లో రష్యా మొట్టమొదటి ఉపగ్రహం స్పుత్నిక్ను ప్రయోగించిన తరువాత మనదేశానికి కూడా ఉపగ్రహ అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు తెలియజేసి ' సాంకేతిక పరిజ్ఞాన్ని సామాన్యులకు అందుబాటు లోకి తీసుకొచ్చేటప్పుడే మన దేశంలోని ఎన్నో సమస్యలను పరిష్కరించ వచ్చని ఒప్పించి, 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హెూమీ భాభా

## శత ప్రయోగాల వేదిక శ్రీ హరి కోట

పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఇన్కోస్పార్)ను ఏర్పరచారు. భవిష్యత్తులో ఇతర దేశాలు ఉపగ్రహానికి కావలిసిన సకల పరికరాలను అందించక పోవచ్చని ముందుగానే ఊహించిన సారాభాయ్ అవసరమయిన అన్ని భాగాలనూ దేశీయంగానే తయారు చేసే దిశగా ప్రయత్నం చేసారు. 1969లో ఇన్కోస్పార్ ఇస్రోగా రూపొందింది. ఉపగ్రహాలను తయారు చేయడంతోపాటు వాటిని ప్రయోగిం చే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎల్వి) ఉపగ్రహ వాహకనౌక రూపకల్పనకు నాంది పలికారు.

మొదటి నుండి ఉపగ్రహాల నిర్మాణాన్నే దృష్టిలో పెట్టుకొని దానికి అవసరమయిన భూ ఉపరితల లక్షణాలను అధ్యయనం చేసేందుకు కేరళ లో త్రివేండ్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. కానీ దీని చుట్టూ జనసంచారం ఎక్కువగా ఉండడం, పైగా ఆ కేంద్రం మినీ రాకెట్ ప్రయోగాలకే పరిమితం కావడం కారణాన్న భవిష్యత్తులో చేయ-౧బోయే భారీ రాకెట్ ప్రయోగాల దృష్ట్యా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం మరోచోట రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అనువైన రాకెట్ ప్రయోగ కేంద్ర స్థలం కోసం అన్వేషణలో అన్ని ప్రాంతాలనూ పరిశీలిస్తూ రాగా శ్రీహరికోట దీవి ఆయన కంటపడింది.

రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు ఎంత దగ్గరగా ఉంటే భూమ్యా కర్షణను అధిగమించి పైకి వెళ్ళేందుకు రాకెట్కు అంత తక్కువ ఇంధనం ఖర్చౌతుంది. శ్రీహరికోట భూమధ్యరేఖకు దగ్గరగా ఉండడం ఇస్రో ఈ స్థలాన్ని ఎంచుకోవడానికి ఒక కారణం. భౌగోళికంగా సాంకేతికంగా, ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న ఫ్రెంచి గయానాలోని కౌరు రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు కేవలం ఏడు డిగ్రీల అక్షాంశంలోనూ, ఎంతో గొప్పదిగా చెప్పుకునే అమెరికాలోని కేఫ్ కెన్నెడీ రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు 28 డిగ్రీల అక్షాంశంలోనూ ఉండగా శ్రీహరికోట 13 డిగ్రీల 43 సెకండ్ల అక్షాంశం మీద ఉంది. భూమధ్య రేఖకు అత్యంత దగ్గరగా ఉన్న కేంద్రాల్లో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఇంకా రాకెట్ ప్రయోగ దిశలో భూభాగాలేవీ లేకపోవడం, ఒకవేళ ప్రయోగమేదైనా విఫలమైనా రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోయేందుకు వీలుండడం లాంటి కారణాలు కూడా కలిసి రావడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 1969 లో శ్రీహరికోట రాకెట్ కేంద్రంగా ఎంపికయింది. ఇక్కడ నుంచి 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్ని ప్రయోగించింది. కానీ ఈ ప్రయోగం సఫలం కాలేదు. షార్ నుంచి ఇస్రో జరిపిన 99 ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యాయి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433 విదేశీ ఉపగ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18 స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008 లో చంద్రయాన్1 , 2014 లో మంగళ్యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచ రికార్డు, 2017లో జిఎస్ఎల్వి మార్క్ 3 ప్రయోగం, 2023లో చంద్రయాన్- 3 విజయవంతం అయ్యాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను కూడా విజయవంతమైంది.

నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్విఎస్) అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది మనదేశం లోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి ఖచ్చితమైన స్థానం, వేగం, సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించబడింది. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్పీఎస్), రెండు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). ఎస్పీఎస్ 20 మీటర్ల కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని, సేవా ప్రాంతంలో 40 నానో సెకెన్ కంటే మెరుగైన సమయ ఖచ్చితత్వాన్ని అందిస్తుంది.

రెండో తరం ఉపగ్రహాల్లో మొదటిదైన ఎన్వీఎస్-01ను 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 ద్వారా ప్రయోగించారు. తొలిసారిగా ఎన్వీఎస్-01లో స్వదేశీ అణు గడియారాన్ని ప్రయోగించారు. ఎన్వీఎస్ సిరీస్లోని రెండో ఉపగ్రహం ఎన్వీఎస్-02ను ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్తో కాన్ఫిగర్ చేయడంతో పాటు సీ-బ్యాండ్లోని పేలోడ్ను దాని మునుపటి ఎన్వీఎస్-01 మాదిరిగానే రూపొందించారు. ఇది 2250 కిలోల లిఫ్ట్-ఆఫ్ ద్రవ్యరాశి, 3 కిలోవాట్ల పవర్ హ్యాండ్లింగ్ సామర్థ్యంతో స్టాండర్డ్ - %×% 2కె బస్ ప్లాట్ఫామ్ పై కాన్ఫిగర్ చేయబడింది. ఐఆర్ ఎన్ఎస్ఎస్ -1ఈ స్థానంలో 111.75 డిగ్రీల ఉష్ణోగ్రతను అమర్చనున్నారు. ఎన్వీఎస్-02 ఖచ్చితమైన సమయ అంచనా కోసం స్వదేశీ, సేకరించిన పరమాణు గడియారాల కలయికను ఉపయోగిస్తుంది. ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని ఇతర ఉపగ్రహ ఆధారిత వర్క్ సెంటర్ల సహకారంతో యుఆర్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి) లో రూపొందించి అభివృద్ధి చేసి, ఇంటిగ్రేట్ చేశారు. ఉపగ్రహం వివిధ దశల్లో దాని పనితీరు సమ్మతి యొక్క సమగ్ర ప్రీ-షిప్మెంట్ సమీక్ష డిసెంబర్ 27, 2024న పూ-ర్తయింది. ఈ ఉపగ్రహాన్ని 2025 జనవరి 05న భారత ప్రయోగ కేంద్రం ఎస్డీఎస్సీ-షార్కు పంపారు. ఇది విజయవంతం అయింది. జై భారత్ ! జై భారత్ !

# రాజకీయాల్లో బీసీ కులాల సాధికారత ఏమైనట్టు...



■ ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్న బీసీలు ■ ప్రభుత్వాధికార నాయకత్వ పగ్గాల్లో వెనుకబాటు ■ అన్ని పార్టీలలో బీసీలకు ప్రాధాన్యత తక్కువే ■ ఐక్యత లేకనే చేజార్చుకుంటున్న అవకాశాలు ■ చట్టసభల్లో తగ్గుతున్న బీసీ కులాల సభ్యులు

దాడిశెట్టి శ్యామ్ కుమార్
9492097974.

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన కులగణన సర్వే ఆధారంగా బీసీ ఎస్సీ ఎస్టి ఓసీ మైనారిటీ మొత్తం కులాల సంఖ్య అధికారికంగా రావలసి ఉంది తద్వారా నియమించబడిన బీసీ కమిషన్ సర్వేను సమీక్షించవలసి ఉంటుంది కుల గణన సర్వే ఎలా ఉన్నా గతం నుండి వెనుక బడిన కులాల (బీసీ) జనాభా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ప్రాథమిక అంచనా బీసీ జనాభా ఓటర్ల సంఖ్య పరంగా ఎక్కువే అయినా దేశ స్వాతంత్ర అనంతరం జరిగిన వివిధ ఎన్నికలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వరకు ఎలక్షన్లలో ఎస్సీ ఎస్టీ మైనారిటీ వారితోపాటు బీసీ కులాలకు చట్టసభల్లో అవకాశాలు ఉన్నప్పటికీ బీసీల అనైఖ్యత ఓటు బ్యాంకు రాజకీయాలు తక్కువ శాతం ఉన్న ఉన్నత కులాల వారికి నేరుగా లబ్ధి పొందేందుకు అవకాశం కల్పించే దిశగా ఉండి ఉండవచ్చు అనే విభిన్నమైన వాదనలు తెరపైకి వస్తుండడం శోచనీయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు ప్రస్తుత తెలంగాణలో కేవలం చట్టసభల్లో ఎస్సీ ఎస్టీ మైనార్టీ చెందినటువంటి వారికి రావలసిన వాటా ప్రకారం చట్ట సభల్లోకి వెళ్తున్నప్పటికీ బీసీ సామాజిక వర్గానికి చెందినటువంటి లెక్కలను పరిశీలిస్తే కారణాలు ఏవైనా చట్టసభల్లో ఎమ్మెల్యేలు మంత్రులుగా ముఖ్యమంత్రులుగా బీసీ లు అవకాశాలను చేజార్చుకోవడం వలన ఎక్కువగా ఉన్నత వర్గానికి చెందినవారే ఆయా స్థానాలు కైవసం చేసుకోవడం ఉన్నత కులాలకు చెందిన వారికే ఎక్కువ అవకాశాలు రావడం జరిగి ఉండవచ్చనే ఊహాగానాలు లేకపోలేదు క్రమంలో ఓటర్ల పరంగా మిగతా కులాల కంటే తక్కువ శాతం ఉన్నటువంటి ఉన్నత వర్గాల కూలాలలోని కొంత మంది కనుసన్నలలోనే బీసీ సామాజిక వర్గం నడుస్తుందా అనే అనుమానాలు కలుగక మానవు

గ్రామీణ స్థానిక సంస్థలు ఎన్నికల్లో కింది స్థాయి మినహా ఇప్పటివరకు రాష్ట్ర స్థాయి చట్టసభల్లో బీసీల మెజారిటీ నాయకత్వం చాలా స్వల్పమని చెప్పవచ్చు కేవలం బీసీలు ఓటు బ్యాంకు గాని మిగిలిపోతుండడం ఇప్పటికైనా బీసీ కూలాలు ఐక్యతతో అధిక ప్రాధాన్యతతో చట్టసభల్లోకి వస్తే బీసీ కులాల సామాజిక వర్గానికి సాధికారత లభిస్తుందేమో

బీసీ సామాజిక వర్గంలో ఉన్నత మైన ఉత్తమమైన విద్యా విలువలతో రాజకీయ స్పృహ కలిగిన మేధావులు ఎంతో మంది ఉన్నప్పటికీ స్వతగా తమ సామాజిక వర్గం సహకారం తో రాజ్యాధికారాన్ని సాధించుకోలేకపోవడం ఒక ఎత్తు అయితే దేశంలో ప్రజాస్వామ్య ఎన్నికల ప్రారంభమైనప్పటి నుండి ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి తెలంగాణ రాష్ట్రం వరకు అధిక శాతం అగ్ర కులాల వారే చట్టసభలకు వెళ్తుండడం ముఖ్యమైన శాఖ పరమైన రాజ్యాధికారం కూడా వాళ్ల చేతుల్లోనే ఉన్నట్టు గణాంకాలు సూచిస్తుండటం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల తో పోలిస్తే తక్కువ సంఖ్యలో ఉన్న ఓసీ వర్గానికి చెందిన అగ్రకులాల వారు ప్రజాస్వామ్యవస్థలో ఎక్కువ ఉన్నత పదవుల్లో ఉంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి

రాష్ట్రంలో అగ్రకులాలకు చెందినటువంటి రాజకీయ నాయకత్వం స్వతగా వారి ఓటు బ్యాంకు తోనే చట్ట సభలకు పోవాలంటే కావలసిన ఓట్లు ఉన్నాయా లేవా అనే అంశాన్ని పక్కన పెడితే వెనుకబడిన తరగతుల కులాలు సంఘటితమై బీసీ సామాజిక వర్గానికి చెందినవారికి అధిక సంఖ్యలో మెజారిటీ వచ్చేటట్లు చేస్తే చట్టసభల్లో కూడా బీసీ సాధికారత రాజ్యాధికారం గణనీయంగా పెరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారికంగా కులగణనను చేపట్టినప్పటికీ వివరాలు పూర్తిస్థాయిలో అధికంగా ప్రకటించాల్సి ఉంది కులగణన సర్వే ప్రకారం రాబోవు కాలంలో గ్రామ సర్పంచ్ జెడ్పిటిసిలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుల గణన ప్రభావం కొంతైనా ఉంటుందని అభిప్రాయపడుతున్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తే సమన్వయంగా బీసీ కులాలు ఐక్యతారాగంతో ముందుకు వస్తే రాజకీయ సామాజిక ఆర్థిక తదితర రంగాల్లో వెనుక బడిన కులాల (బీసీ) సాధికారత చాలా మెరుగు పడుతుంది అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి ఏది ఏమైనా కుల గణన ప్రాధాన్యత బీసీ సాధికారత రానున్న రోజుల్లో చట్టసభలతో !పాటు అన్ని రంగాల్లో ఏ విధంగా ప్రభావితం చూపిస్తుందో వేచి చూడాల్సిందే

# మన ఎంపీల్లో పోరాట పటిమ తగ్గుతోందా?

■ రాష్ట్రానికి ఇచ్చిన హామీల మేరకు కేంద్రం కేటాయింపులు ■ ఆంధ్రప్రదేశ్ కు ఒక్క ప్రత్యేక పథకం తేలేని నిస్తేజం ■ పథకాల అమలులో జాప్యానికి గత సర్కారుపై నిందలు ■ నీతి అయోగ్ చేసిన ప్రకటనతో బాబు వాయిదాల పాట ■ ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు ఎన్నటికి?



బి.వి.రమణ
94407 40015

అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదనే సామెత ఉంది. ఇది ఎందుకు వచ్చింది? అమ్మ అడగకుండా అన్నం పెట్టలేక కాదు. ఇంట్లో ఉన్న పేదరికంతో అల్లాడుతూ అన్నం పెట్టలేని పరిస్థితుల్లో ఉండటం వల్ల. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిస్థితి కూడా అంతే. అడగకుంటే ఏదీ సాధించలేరు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత రాష్ట్రం పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా మంగళవారం ప్రకటించారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందన్నారు. అంతకు ముందు పరిపాలించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా రాష్ట్రాన్ని అప్పుల పాలు జేసి చంద్రబాబు వెళ్లిపోయారని పాట పాడారు. ఒకరు పోయి మరొకరొచ్చినా పాటలో మాత్రం తేడా రాలేదు. ఇదేనా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నది. నిజానికి జగన్ ప్రజాదరణ ఉన్న నాయకుడు. ఆయన ఎందుకు చిత్తుగా ఓడిపోయారు. వ్యక్తి గత ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం. భవిషత్ లో రాష్ట్రం దేశంలోనే ఉన్నతమైనదిగా ఉండాలని ప్రజలు కాంక్షించారు. వారి ఆకాంక్షను జగన్ తీర్చలేక పోయారు కాబట్టే పార్టీని పాతాళంలో పడేశారు. కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడు నెలలు దాటింది. ఒక్క అంశం కూడా కుదుట పడలేదు. రాజధాని నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఆ అంశంపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణకు పనులు అప్పగించారు. ఆ తరువాత రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని చెబుతున్నారు. గత ప్రభుత్వం లాగే ఉచిత హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలే కాకుండా గతంలో జగన్ ఇచ్చిన ఉచి త నగదు పథకాలు యథా తథంగా కొనసాగుతాయని ఎన్నికల్లో చెప్పా రు. కానీ అవేవీ కనిపించడం లేదు. తెరమరుగయ్యాయి. అయినా ప్రజల ౦ కోరుకుంటోంది అభివృద్ధి అనేది స్పష్టమైంది. కేంద్రం ఇచ్చిన పోలవరం ప్రాజెక్టు ను కేంద్రమే నిర్మాణం చేపట్టి ఉంటే ఈ పాటికి పూ-ర్తయ్యేది. అలా కాకుండా రాష్ట్రం పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుని వేసిన అడు గులు తప్పటడుగులుగా మారి పదేళ్ల తరువాత మళ్లీ మొదటి నుంచి ఎత్తుకున్నారు.

ఇక ఈ రాష్ట్రానికి కేంద్ర సాయమే దిక్కు. కేంద్రం అమరావతికి అప్పులు ఇప్పించినా.. పెట్టుబడి దారులను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని చెప్పినా అవేవీ ఉపయోగ పడవు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవసరమైన సాయం చేసి వాటి నిర్మాణాలు, మరమ్మతులు ఈ నాలుగేళ్లలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రం తీసుకున్న అప్పుల్లో కనీసం సగం కేంద్ర ప్రభుత్వం తీర్చాలి. వెనుక బడిన ప్రాంతాలకు ఇస్తామని చెప్పిన ప్యాకేజీలు ఇవ్వాలి. సీజీఎస్టీని రద్దు చేయాలి. ప్రత్యేక హెూదా ఇవ్వాలి. అప్పుడే రాష్ట్రం కాస్త ఊపిరి పీల్చుకునేందుకు అవకాశం ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ఎంపీలు ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉందన్నారు. విద్య, వైద్యానికి సంబంధించి ప్రత్యేకించి పేదలకు పైసా ఖర్చులేకుండా సకాలంలో వైద్యం, విద్య అందేలా చర్యలు తీసుకోవాలి.

ఇందుకు రాష్ట్ర బడ్జెట్ లో చేసే కేటాయింపులు సరిపోవు. అందుకే కేంద్రం నుంచి ప్రత్యేకంగా గ్రాంటులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రాన్ని నిలదీయాలి. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని సూటిగా ప్రశ్నించాలి. అవసరమైతే పార్లమెంట్ ను స్తంభింప జేయాలి. అంతే కాని బ్రతిమాలు కుంటే సాయం అందించే రోజులు పోయాయని ప్రజలు చర్చించుకోవడం విశేషం.

రాష్ట్ర ప్రభుత్వానికి ఇదొక మంచి అవకాశం. కేంద్రంలోని కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వం కొనసాగాలంటే ఏపీ ఎంపీల సపోర్టు ఎంతో అవసరం. ఎంపీలు సపోర్టును ఉప సంహరించుకుంటే కేంద్రంలోని ప్రభుత్వం కూలిపోయే అవకాశం కూడా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎంపీలు ఎందుకు పోరాడటం లేదనేది ప్రశ్నగా మారింది. కేవలం నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు తప్ప ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పోరాట మంటే రోడ్ల పై కూర్చుని రోడ్డు రోకోలు చెయ్యడం కాదు. మాటలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం కూడా పోరాటమే. శ్రమలేని పోరాటం చేసేందుకు కేంద్రంలో ప్రస్తుతం రాష్ట్ర కూటమికి మంచి అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు కాకుండా రాష్ట్రాన్ని మరెప్పుడూ అభివృద్ధి చేయలేరు. దీపం ఉన్నప్పుడే ఇంటిని చక్కబెట్టుకోవాలనే సామెతగా ప్రస్తుతం రాష్ట్రానికి వెలుగులు నిండాలంటే కేంద్రం పెద్ద మనసుతో సాయం చేయాలి తప్ప వేరే మార్గాలు కనిపించడం లేదు. వారిచేత, వీరి చేత డబ్బులు ఇప్పించామంటే కాదు. తమ వంతుగా రాష్ట్రాభివృద్ధికి ఏమి చేశామని ధైర్యంగా కేంద్రం చెప్పాల్సిన పరిస్థితిని ఎంపీలు కేంద్రానికి తీసుకురావాల్సి ఉంది.

పాలకుల తప్పులు ఎత్తి చూపించే వారు లేకుండా పోవడంతో నాయకుల్లో సోమరితనం పెరిగింది. ఆలోచనలు సొంతానికి తప్ప ప్రజల పక్షాన నిలబడేందుకు చేయలేక పోతున్నారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా ఇవ్వగలిగితే ప్రజలు అంతకు మంచి ఏమీ కోరుకోరని పాలకులు తెలుసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగు నీరు ఇవ్వగలిగితే ఏ ఫ్యాక్టరీ ఈ రాష్ట్రానికి అవసరం లేదని, ధాన్యాగారంగా రాష్ట్రం విలసిల్లుతుందన్నారు.

ఎంపీలు పార్లమెంట్లో అనుసరించాల్సిన వ్యూహం గురించి మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉద్బోధించారు. ఉద్బోధలో వారికి చెప్పంది ఒకే ఒక్క అంశం. రాష్ట్రానికి నిధులు సమకూర్చుకునే విధంగా మాట్లాడాలని, హితోధికంగా సాయం చేయాలని కోరాలన్నారు. ప్రత్యేకించి రాష్ట్రంలో సీజీఎస్టీని రద్దు చేయాలనో, ప్రత్యేక హెూదా ఇవ్వాలనో, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలనో ఎందుకు డిమాండ్ చేయడం లేదు. ఈ విషయాలపై గట్టిగా పార్లమెంట్ లో నిలదీయాలని సీఎం సభ్యులకు ఎందుకు చెప్పటం లేదనేది కూడా పలువురిలో చర్చ నియాంశమైంది. ఈనెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

# బెట్టింగ్, సామాజిక మాధ్యమాలకు బానిసలుగా యువత

నేడు యువత సామాజిక మాధ్యమాల బారిన పడి విలువయిన భవిష్యత్ ని సర్వ నాశనం చేసుకుంటూ వున్నారు.కొంత మంది కి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతో కలిసి ఐపీఎల్లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాత సెల్ఫోన్లో ఆన్లైన్ బెట్టింగ్ యాప్లోకి ప్రవేశించి పందేలు కట్టడం ప్రారంభించడం జరుగుతుందని ఆరోపణలు విన వస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు.. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం,. నగదు కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు.అరచేతిలో ఇమిడే సెల్ఫోన్తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశం వచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపం చేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ,ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్ ఫోన్లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొని ఇస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్ఫాం, యాప్లలో వీడియోలు చూడటం ప్రారంభించడము, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి . కరోనా లాక్డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీ సమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్షిప్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతిక విలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్ఫోన్లు, ల్యాప్టాప్లు, ట్యాబ్లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటి చూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడం చాలా ఆందోళనకరం.ఆన్లైన్ బెట్టింగ్లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘా పెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్లలో యువత భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు.సెల్ఫోన్ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు విద్యార్థులు, యువత పలు రకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ,



ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి.. విద్యార్థులు, యువత బలహీనతలను ఆసరాగా తీసుకొని బెట్టింగ్ తరహా వ్యాపారాలు కొంతమంది చేస్తున్నారని సామాజికవేత్తలు అభిప్రాయము వెలి బుచ్చుతూ వున్నారు. తొమ్మిది గంటల కల్లా పిల్లలని నిద్రపుచ్చి తెల్లవారుజామున ఐదు గంటలకే నిద్ర లేపి ధ్యానం, యోగా సాధన చేయించాలి.యువత సెల్ ఫోన్ కి దూరంగా వుండి మితం గా వాడాలి.అనారోగ్య సమస్యలకు దూరంగా వుండాలి.

తంగళ్ళపల్లి కుమార స్వామి
8106133144

# పర్యాటకాభివృద్ధిలో ప్రథమ వాటాదారు ఆదివాసీ కావాలి

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగం పై ప్రత్యేక దృష్టి పెట్టింది.ఎన్నో అనుకూలతలు,ఎదగడానికి ఎన్నో అవకాశాలున్న రంగం ఇది.అటు ఆదాయం తో బాటు ఇటు స్థానికులకు ఉపాధి, సంస్కృతి పరిరక్షణ లకు ఉపయోగపడే పర్యాటక రంగం ద్వారా దీర్ఘకాల లబ్ధి చేకూరాలంటే, ఏ రకం గానూ అంటే వనరుల రూపంలో గానీ, ఇతరత్రా నష్టపోకూడదనుకుంటే ప్రభుత్వం జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంటుంది. తీర ప్రాంతం,ఆధ్యాత్మిక కేంద్రం,ఆరోగ్య కేంద్రం లాంటివి అభివృద్ధి చెయ్యడం వేరు. ప్రకృతి అందాల ఆదివాసీ ప్రాంతాల్లో పరిస్థితి వేరు.అక్కడ తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తలు అదనంగా అవసరమౌతాయి. అవి :

1. ఆదివాసీ ప్రాంతాల్లో అమలౌతున్న ప్రత్యేక చట్టాలు, వన్ ఆఫ్ సెవెంటీ,పీసా రక్షణలకు ఏ మాత్రం భంగం రాకూడదు.
2.పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్ వినియోగం,జీవన విధానాన్ని గాడి తప్పించే చర్యలు,నిర్మాణాలు జరప రాదు.
3. ప్రాజెక్టుల్లో స్థానిక ఆదివాసీల్ని నామ మాత్రపు లబ్ధిదారులు గా భావించ కుండా,ప్రథమ వాటాదారులు గా తీసుకోవాలి.అందుకు తగ్గ శిక్షణ,వనరులు ప్రభుత్వమే అందించాలి.
4. ఆయా గ్రామాలు,ఆవాసాలకు లాభం లో నికర శాతం కేటాయించాలి.
5. పర్యాటకులు ఆ ప్రాంతాన్ని ఇష్టపడేలా, స్థానిక సంస్కృతి పట్ల సున్నితంగా,గౌరవంగా వ్యవహరించేలా,ఉత్తమ జీవన విధానాలు ఒకరికొకరికి మార్పిడి జరిగేలా కార్యక్రమాలు రూపొందించాలి.అలాంటి అవగాహన కల్పించాలి.
6.యువతకు గైడ్లుగా మాత్రమే కాకుండా సంస్కృతి ప్రతినిధులుగా వ్యవహరించేటట్లు శిక్షణ కల్పించి ఎదిగేలా ప్రోత్సహించాలి.
7.స్థానిక ఉత్పత్తులకు లాభసాటి మార్కెట్ తో అనుసంధానం చెయ్యాలి.

ఒక పర్యాటక స్థలాన్ని అభివృద్ధి పరిచి వదిలేస్తే చాలదు.సరైన నిర్వహణ ఉండాలి.సేద తీరడానికి వచ్చిన వారికి ప్రయాణం సౌకర్యంగా,విడిది ఆహ్లాదంగా,అంతర్జాల పరంగా కూడా కనెక్టివిటీ ఉంటేనే ఆకర్షణీయం అవుతుంది. అభివృద్ధి కి అదనపు భరోసా దొరుకుతుంది.

డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ,
:9440836931.



## తొక్కిసలాటపై న్యాయ విచారణ.. మృతులకు రూ.25లక్షల పరిహారం

ప్రయాగ్ రాజ్ : ఉత్తరప్రదేశ్లోని ప్రయాగ్రాజ్లో బుధవారం జరిగిన తొక్కిసలాట ఘటనపై యోగి ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. ఇక మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ప్రకటించింది.
"ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటిస్తున్నాం. న్యాయ కమిషన్ ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తుంది. ఈ విషయంలో ప్రధాన కార్యదర్శి మరియు డీజీపీ స్వయంగా ప్రయాగ్రాజ్ను సందర్శించి, అవసరమైతే ఆ సమస్యలన్నింటినీ పరిశీలిస్తారు. "అని యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.
బుధవారం తెల్లవారుజామున మౌని అమావాస్య సందర్భంగా అమృత స్నానం ఆచరించేందుక పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అయితే ఒకే ప్రదేశంలో పెద్ద ఎత్తున భక్తులు గుంపు కూడి ఉన్నారు. అయితే బారికేడ్లు కొంత మంది బద్దలు కొట్టారు. దీంతో తీవ్ర గందరగోళం నెలకొని తొక్కిసలాటకు కారణమైంది. ఇక ఈ తొక్కిసలాటలో 30 మంది చనిపోగా.. 60 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే మృతుల్లో 25 మంది డెడ్బాడీలను గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ 35 మంది చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

# మహా కుంభమేళాలో తొక్కిసలాట

- 20 మంది మృతి పలువురికి గాయాలు
- సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్న అధికారులు
- ఏం జరుగుతుందో తెలియకపోవడంతో భక్తులు భయంతో పరుగులు
- బారికేడ్లు విరగడంతో ఒకరిపై మరొకరు పడిపోయారని వివరణలు
- గతంలోనూ ఇదే తరహా ఘటనలు జరిగిందంటున్న భక్తగణం

ప్రయాగ : యూపీ మహా కుంభమేళాలో ఏం జరుగుతోంది? ఎందుకు అపశృతి చేటు చేసుకుంది? అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందా? మిడ్ నైట్ రెండున్నర గంటల సమయంలో ఘటన ఎలా జరిగింది? దీనిపై ప్రభుత్వ వర్గాలు ఏమంటున్నాయి? ఇవే ప్రశ్నలు చాలామంది భక్తులను వెంటాడుతున్నాయి. మహా కుంభమేళాలో అపశృతులు కంటిన్యూ అవుతున్నాయి. మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 20 మంది భక్తులు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ మేరకు పలు జాతీయ ఛానెళ్లు ప్రకటించాయి.
ఘటన తర్వాత వెంటనే బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయిస్తోంది అక్కడి సిబ్బంది. మంగళవారం అర్థరాత్రి ధాటి తెల్లవారితే బుధవారం వచ్చింది. మిడ్ నైట్ 2.30 నిమిషాలు భారీ ఎత్తున భక్తులు త్రివేణి సంగమం వద్దకు స్నానాలు చేసేందుకు వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లు విరగడంతో ఒకరిపై మరొకరు పడిపోయారు.
దీంతో ఏం జరుగుతుందో తెలియకపోవడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఘటన విషయం తెలియగానే సహాయక చర్యలు చేపట్టాలని యోగి సర్కార్ అధికారులను ఆదేశించింది. తొక్కిసలాట విషయం తెలియ గానే ప్రధాని నరేంద్రమోదీ.. సీఎం యోగికి ఫోన్ చేశారు. ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.
మరోవైపు తొక్కిసలాట ఘటన కారణంగా అమృత స్నాన్ను రద్దు చేసినట్లు అఖారా పరిషత్-మండలి ప్రకటించింది. త్రివేణి సంగమంలో స్నానమాచరించిన తర్వాత భక్తులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.
కుంభమేళాలో జరిగిన ఘటనలు
స్వాతంత్ర్యం తర్వాత మొట్టమొదటి కుంభమేళా 1954లో జరిగింది. దేశ చరిత్రలో ఊహించని ఘటన అది. 3 ఫిబ్రవరి 1954న, అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్రాజ్)లో కుంభమేళా జరిగింది. మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర స్నానాలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దాదాపు 800 మంది భక్తులు చనిపోయినట్లు నేషనల్ మీడియా రికార్డులు చెబుతున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత సరిగ్గా 1986 హరిద్వార్లో జరిగిన కుంభ మేళాలో కనీసం



200 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ఉత్తరప్రదేశ్ సీఎం వీర్ బహదూర్ సింగ్తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ఎంపీలతో కలిసి హరిద్వార్కు వచ్చారు. ఆ సమయంలో గందరగోళం నెలకొంది. భద్రతా సిబ్బంది భక్తులను నది తీరానికి రానీయకుండా ఆంక్షలు విధించారు. వచ్చిన భక్తులను అదుపు చేయలేక పోయారు. ఫలితంగా తొక్కిసలాటకు దారి తీసింది.
మహారాష్ట్రలోని నాసిక్ కుంభమేళాలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుంది. పుణ్యస్నానం కోసం వేలాది మంది భక్తులు గోదావరి నది తీరానికి వచ్చారు. ఆ సమయంలో తొక్కిసలాట జరిగింది. దాదాపు మూడు డజన్లకు పైగా భక్తులు మరణించారు. దాదాపు 100 మందికి పైగా గాయపడ్డారు. సరిగ్గా పుష్కర కాలం కిందట కుంభమేళా సందర్భంగా అలహాబాద్ రైల్వే స్టేషన్లో తొక్కిసలాట జరిగింది. 10 ఫిబ్రవరి, 2013న చోటు చేసుకుంది. భక్తుల తాకిడి పెరగడంతో ఒక్కసారిగా పాదచారుల వంతెన కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 42 మంది ప్రాణాలు కోల్పోయారు. 45 మంది గాయపడిన విషయం తెల్సిందే.






## విజయ్చౌక్లో అట్టహాసంగా 'బీటింగ్ రిట్రీట్'



ఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవ ముగింపు వేడుకలు ఢిల్లీలో ఘనంగా జరిగాయి. బుధవారం సాయంత్రం విజయ్చౌక్ వద్ద సైనిక, పారామిలిటరీ దళాలు నిర్వహించిన బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం అలరించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సహా పలువురు కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ దళాలకు చెందిన వాయిద్య బృందాలు లయబద్ధంగా సంగీత కార్యక్రమం నిర్వహించాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలు బీటింగ్ రిట్రీట్తో ముగుస్తాయి.

## అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోత

### బాధ్యతలు తీసుకున్నాక ట్రంప్ తొలి అడుగు..!



వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ట్రంప్ (%ణశీఖుశ్రీం ుతీబఎజూ%) సర్కారు బైఅవుట్ను ప్రకటించింది. ఈమేరకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్మెంట్ నుంచి ఒక మెమో వెలువడింది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలు, ప్రవర్తన, అనుకూలతలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఒక ఈమెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు ఓ నిర్ణయానికి రావాలని దానిలో వెల్లడించారు. ఉద్యోగాలు మానేద్దామని అనుకొని ఆగిపోయినవారు దీనిని ఎంచుకోవచ్చు. కొవిడ్ తర్వాత చాలామంది ఉద్యోగులు రిమోట్ విధానంలో పని చేస్తున్నారు. తాజాగా వారు వారానికి ఐదు రోజులు ఆఫీసులకు రావాలని ట్రంప్ సర్కారు తేల్చిచెప్పింది. ఈ కార్యాలయాల్లో విధులకు హాజరుకావడం ఇష్టం లేని ఉద్యోగులు దీనిని ఎంచుకోవచ్చని చెబుతున్నారు. సుమారు 10-15శాతం మంది దీనిని ఎంచుకోవచ్చని భావిస్తున్నారు. ఇది విజయవంతంగా అమలైతే అమెరికా ప్రభుత్వ ఖర్చులు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. ఓవైపు ఫెడరల్ నిధులు, రుణాలను నిలిపివేసిన వేళ ఈ వార్త బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. చాలా స్థానిక సంస్థల ప్రభుత్వాలు, నాన్ ప్రాఫిట్ సంస్థలపై దీని ప్రభావం ఉండనుంది.
**భారత్నూ వదిలిపెట్టం..** గతేడాది చివరికి అమెరికాలో దాదాపు 30 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దేశం మొత్తం ఉద్యోగుల్లో ఇది 1.9శాతానికి సమానం. ప్యూ రీసెర్చి సెంటర్ లెక్కల ప్రకారం ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి సగటున 12 ఏళ్లపాటు పని చేస్తాడు. తాజాగా ట్రంప్ ఆఫర్ను కొద్ది శాతం మంది ఆమోదించినా.. అది ప్రభుత్వ పాలన, ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అనుభవం ఉన్న ఫుడ్ఇన్స్పెక్టర్లు, నీటి పరీక్షల విభాగం, వైమానిక రంగం, నిత్యావసర వస్తువుల రక్షణకు సంబంధించిన ఉద్యోగుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. మరోవైపు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీ మాట్లాడుతూ దీనిని వాలంటరీ బైఅవుట్గానే చూడాలన్నారు.

## కేజ్రీవాల్ కు హరియాణా కోర్టు సమన్లు

### ఫిబ్రవరి 17న హాజరుకావాలని ఆదేశం

న్యూఢిల్లీ : ఆమ్ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్కు హరియాణా కోర్టు సమన్లు జారీ చేసింది. ఢిల్లీకి నీటి సరఫరాను అడ్డుకొనేందుకు హరియాణా పాలకులు యమునా నదిని విషపూరితం చేశారంటూ ఢిల్లీ ఎన్నికల వేళ ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. దీంతో కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై హరియాణా ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. యమునా నది నీటిని విషపూరితం చేసినట్లు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే చేసిన అసత్య వ్యాఖ్యలతో అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
**ఫిబ్రవరి 17న విచారణ :** ఈ నేపథ్యంలో కేజ్రీవాల్కు హరియాణా కోర్టు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 17న కోర్టులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ రోజు విచారణకు హాజరు కాకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ సోనిపట్లోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు (సీజేఎం) నోటీసులు జారీ చేసింది. కేజ్రీవాల్ తన ఆరోపణల వెనుక ఉన్న కారణాలను వివరించాలని, హరియాణా ప్రభుత్వం యమునా నది నీటిని విషపూరితం చేస్తుందన్న వాదనలను ధ్రువీకరిస్తూ నివేదిక ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. అంతకుముందు కేజ్రీవాల్ వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యమంటూ హరియాణా మంత్రి విపుల్ గోయల్ తీవ్రంగా స్పందించారు. "కేజ్రీవాల్ మా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణల వల్ల హరియాణా, ఢిల్లీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తుంటే మేము ఊరికే విడిచిపెట్టం. దీనిపై తగిన చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ మాటలు అవాస్తవమని నిరూపిస్తాం" అని మండిపడ్డారు.



**నదిలో నీరు తాగిన నయాబ్ సింగ్ :** ఇదిలా ఉండగా ఢిల్లీ సరిహద్దుల్లో హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నదిలో నీటిని తాగారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్ని భయానికి గురిచేసేలా కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. తాను ఈరోజు యమునా నది వద్ద నీరు తాగినట్లు తెలిపారు. సీఎం నయాబ్ సింగ్ నీరు తాగినట్లు ఉన్న వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసిన కేజ్రీవాల్, ఆ నీరు విషపూరితంగా ఉండటంతో నయాబ్ సింగ్ సైనీ నీటిని తాగినట్లు నటించి, ఆ తర్వాత ఆ నదిలోనే ఉమ్మేశారని పేర్కొన్నారు. అమ్మోనియా కాలుష్యంతో యమునా నదిలో నీరు ఢిల్లీ ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమని తాను చెబితే, తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని బెదిరించారన్నారు. తాము తాగలేని అదే విషపూరిత నీటిని ఢిల్లీ ప్రజలకు ఇవ్వాలని వారు కోరుకుంటున్నారు. ఎప్పటికీ అలా జరగనివ్వనని పేర్కొన్నారు.

## తెలంగాణలో దూసుకెళ్తున్న బీసీ వాదం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమం దూసుకెళ్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా స్థానిక సంస్థలు 42 శాతం రిజర్వేషన్లు ఎలక్షన్ లే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని వర్గాలు పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం పెద్దన్న పాత్ర పోషిస్తుంది. ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలను సమయత్వం చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. బీసీ మేధావులను సమాజానికి పరిచయం చేస్తే ప్రభుత్వాలు బీసీలకు చేసిన అన్యాయం పై ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీలకు జరిగిన అన్యాయంపై సమర శంఖం పూరించి ఇప్పటికే మిర్యాలగూడ, నలగొండ లలో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి బీసీలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి రెండో తేదీన తీన్మార్ మల్లన్న వరంగల్ జిల్లా వేదికగా భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ ఆజాది అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర పటేల్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర ప్రారంభమైంది ఈ యాత్ర ఇప్పటికే 250 కిలోమీటర్లు పూర్తయింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాద్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు.
సమాజంలోని అన్ని వర్గాలను ఏకం చేయాలన్న ఉద్దేశంతో అవేర్ ఫౌండేషన్ అధినేత, సీనియర్ బిజెపి నాయకులు కటకం నరసింహారావు ఆధ్వర్యంలో బీసీలలో ఉన్న వివిధ వర్గాలను ఏకం చేసేందుకు మేధావులు కవులు, కళాకారులు, కుల సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆలోచన వేదిక ద్వారా మేదో మధనం చేస్తున్నారు. అంతేగాక యాదగిరిగుట్ట కేంద్రంగా శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతంగా ముగించారు. గత 50 సంవత్సరాలుగా బీసీ ఉద్యమం కొనసాగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య సైతం ఉమ్మడి రాష్ట్రాల్లో కార్యక్రమాల నిర్వహిస్తూ బీసీలను చైతన్య పరుస్తున్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్ సైతం బీసీ ఉద్యమంలో ముందున్నారు. బీసీల ఔన్నత్యాన్ని చాటుతూ బీసీలకు జరిగిన అన్యాయంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న సదుద్దేశంతో ప్రముఖ కవి, రచయిత, గాయకుడు దరువు అంజన్న ఆధ్వర్యంలో ధూంధాం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మహానగరంలో పాదయాత్ర నిర్వహిస్తూ బీసీలకు జరిగిన అన్యాయం ప్రశ్నిస్తున్నారు. బీసీలలో భాగమైన ఎంబీసీలను సైతం ఏకం చేయాలన్న ఉద్దేశంతో ఎంబీసీ సంఘాన్ని స్థాపించి బంగారు నరసింహ సాగర్ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బీసీ సంచారజాతులకు న్యాయం చేయాలని నిమ్మల వీరన్న పోరాటం చేస్తున్నారు. బీసీ మహిళలలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని మహిళలకు సైతం రాజకీయ అవకాశాలు కల్పించాలని మహిళలను చైతన్యం చేయాలన్న ఉద్దేశంతో బిజెపి మహిళా మోర్చా నాయకురాలు నాగ పరిమళ ఆధ్వర్యంలో హైదరాబాదులోని గ్రీన్ పార్క్ హోటల్ లో సమావేశం ఏర్పాటు చేసి మహిళ శక్తిని ఏకం చేసేందుకు ప్రయత్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ విధంగా అన్ని వర్గాలు నిరంతరం పోరాటం చేస్తూ 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక సంస్థలు ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న పోరాటం మరోసారి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తుందని చెప్పక తప్పదు.



## ఢిల్లీలో కులగణన

### మహిళలకు ప్రతినెలా ఫ్రీగా రూ.2,500

### కాంగ్రెస్ మేనిఫెస్టో రిలీజ్

ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. తూర్పు ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసింది. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయాన్ని అందిస్తామని తెలిపింది. ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్తో పాటు రూ.500కే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.



రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను ప్రజలకు కల్పిస్తామని పేర్కొంది కాంగ్రెస్. ఉచిత రేషన్ కిట్లను ప్రతినెలా ప్రజలకు పంపిణీ చేస్తామని తెలిపింది. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు ప్రతినెలా రూ.8,500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఢిల్లీ మహానగరం పరిధిలో 100 ఇందిర క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. వాటి ద్వారా కేవలం రూ.5కే భోజనం అందిస్తామని హామీ ఇచ్చింది.
**కాంగ్రెస్ మేనిఫెస్టో - హామీలు :**
ఢిల్లీలో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను రద్దు చేసి, ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగాల్లో ఉన్న వారందరి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.
ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది.
వృద్ధుల నెలవారీ ప్రభుత్వ పింఛను రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంపు
వితంతువుల కుమార్తెల వివాహాలకు రూ.1.1 లక్షల ఆర్థిక సాయం
ఢిల్లీలో వీధి వ్యాపారాలు చేసుకునే 7.5 లక్షల మందికి మరింత మెరుగైన అవకాశాల కల్పన
ఢిల్లీలోని ప్రతీ వార్డులో 24 గంటలూ అందుబాటులో ఉండేలా వైద్య డిస్పెన్సరీల ఏర్పాటు
విద్యార్థుల కోసం ఢిల్లీలో 700 ప్రజా గ్రంథాలయాల ఏర్పాటు
కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్, పార్టీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ బుధవారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఢిల్లీ ప్రజల కోసం ఐదు గ్యారెంటీలు ప్రకటించామని, గ్యారెంటీ అంటే పౌరుల హక్కు అని అర్థమని తెలిపారు. ఆప్, బీజేపీ ఢిల్లీ కాలుష్యాన్ని కట్టడి చేయలేకపోతున్నాయని విమర్శించారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆప్, బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తున్నాయి.



## అధికారంలో ఉన్నప్పుడు మరుపులు.. : నల్గొండలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీతక్క సీరియస్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు రైతు బంధు, హుజూరాబాద్ ఉప ఎన్నికల కోసం దళిత బంధు, జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు ఇంటికి పది వేలు, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ బంధు, మైనారిటి బంధు పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే చరిత్ర బీఆర్ఎస్ దని మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆత్మగౌరవ ఇండ్ల నిర్మాణ వ్యయాన్ని రూ. 5 నుంచి రూ.3 లక్షలకు తగ్గించి, ఇంట్లో కూర్చోని లబ్దిదారుల జాబితాను రెడి చేస్తే..ప్రజలు మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టారని గుర్తు చేసారు. ప్రజల సమక్షంలో పథకాల అర్హులను ఎంపిక చేస్తుంటే తట్టుకోలేక అమాయకులను ఆత్మహత్యలు చేసుకునేలా ప్రోత్సహించి రాజకీయాలు చేస్తోంది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మరువులు..అధికారం పోగానే అరువులు అన్నట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

2023 జూన్, జూలై మాసాల్లో వేయాల్సిన రైతు బంధు నిధులను.. నవంబర్ లో ఎన్నికల రోజు వేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్ అడ్డు చెప్పిందని మంత్రి సీతక్క గుర్తు చేసారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ హామీల వర్షం కురిపించి దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు తో సహా ఎక్కడ ఉప ఎన్నికలు జరిగితే అక్కడే రైతు బంధు నిధులు విడుదల చేసిన ఘనత బీఆర్ ఎస్ కే దక్కుతుందని ఎద్దేవ చేసారు. నాట్ల ముందు కాకుండా..ఓట్ల ముందు నిధులు విడుదల చేసినందుకే ప్రజలు బుద్ది చెప్పారని మండిపడ్డారు. ప్రజలను ఓట్ల యంత్రాలుగా చూసినందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అధికారం దూరం కావడాన్ని జీర్ణించుకోలేక కేటీఆర్ నోరు పారేసుకుంటున్నారని సీతక్క మండిపడ్డారు. ఉచిత ఎరువులు, పంట బోనస్ హామీలను విస్మరించిదెవరని కేటీఆర్ ను మంత్రి సీతక్క ప్రశ్నించారు.

# ఏపీని అప్పుల ఊబిలో ముంచేశాడు

● రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం ● మరో రూ.లక్షా 40 వేల కోట్ల బకాయిలు

● 7 నెలల్లో రూ.22 వేల కోట్ల బకాయిలు చెల్లించిన సీఎం చంద్రబాబు : మంత్రి సవిత

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఒక్కసారి ఛాన్స్ అంటూ బీద అరువులకు చలించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు అవకాశమిస్తే... రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని జగన్ రెడ్డిపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అయిదేళ్లలో కాలంలో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేయగా, లక్షా 40 వేల కోట్ల రూపాయల మేర బకాయిలు పెట్టిందని, ఇప్పుడవి తమ ప్రభుత్వానికి గుది బండగా మారితే, ప్రజలకు శాపంగా పరిణమించాయని విరుచుకుపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల కాలంలో జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రియింబర్స్ మెంట్ కు రూ.22 వేల కోట్లను సీఎం చంద్రబాబునాయుడు చెల్లించారన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక అసమర్థుడు పాలన వల్ల రాజ్యం ఎంతమేర నష్టానికి గురవుతుందో ఏపీని చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. 5 ఏళ్ల జగన్ పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమైపోయాయన్నారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందన్నారు. తన అసమర్థత, తుగ్లక్ నిర్ణయాలతో పాటు జల్సాలు, ఆడంబరాలు, ప్రచార యావ కోసం లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. 5 ఏళ్ల కాలంలో జగన్ రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తే..వాటి అసలు, వడ్డీ తీర్చడానికి ఏడాదికి రూ.71 వేల కోట్లు అవసరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

**రూ.1.40 లక్షల కోట్ల బకాయిలు**

అయిదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూ.1.40 లక్షల కోట్ల బకాయి పెట్టారని మంత్రి సవిత వెల్లడించారు. ఫీజు రియంబర్స్ మెంట్ కింద రూ.3,282 కోట్లు, చిక్కిలు, కోడి గుడ్లకు రూ.256 కోట్లు, వసతి దీవెనకు రూ.989 కోట్లు మేర జగన్ బకాయి పెట్టారన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.1800 కోట్లు, ధాన్యం కొనుగోలుకు రూ.1600 కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు రూ.19 వేల కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,800 కోట్లు, ఉపాధి హామీకి రూ.2,100 కోట్లతో పాటు ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల మేర బకాయిలు పెట్టారన్నారు.

**రూ.19,871 కోట్ల ప్రజాధనం దుబారా**

అయిదేళ్ల పాలనలో జగన్ రెడ్డి తన జల్సాలకు, విలాసాలకు, ప్రచార యావకు రూ.19,871 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. సచివాలయాలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.3 వేల కోట్లు ఖర్చు చేశారని వెల్లడించారు. సర్వే రాళ్లపై తన బొమ్మ కోసం రూ.700 ఖర్చు చేసిన ప్రబుద్ధుడు జగన్ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖలోని రుషికొండపై విలాసంతమైన భవన నిర్మాణానికి రూ.600 కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రకటనల పేరుతో తన సొంత పత్రిక సాక్షికి రూ.500 కోట్లు దోచిపెట్టారన్నారు. తాడేపల్లిలోని తన ప్యాలెస్ వద్ద 986 మంది పోలీసు సిబ్బందిని సెక్యూరిటీ పెట్టుకుని రూ.వెయ్యి కోట్లు వెచ్చించారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ఇనుప ఫెన్సింగ్ కోసం రూ.12.85 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.10 కోట్లు, ప్యాలెస్ ముందు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలపై తన ఫొటో వేయడానికి రూ.13 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని మంత్రి సవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**రూ.8 లక్షల కోట్ల మేర జగన్ లూటీ**

కేవలం 5 ఏళ్ల పాలనా కాలంలో ప్రజలిచ్చిన అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని రూ.8 లక్షల కోట్లు జగన్ రెడ్డి ప్రజాధనాన్ని లూటీ చేశారని మంత్రి సవిత ఆరోపించారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ కు అనుమతులివ్వడంలో...ఇలా ప్రతీ దాంట్లోనూ చేతివాటం చూపుతూ లక్షల కోట్లు కొల్లగొట్టారని మండిపడ్డారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యం పంపిణీలోనూ చేతివాటం చూపారన్నారు. కేవలం జే ట్యాక్స్



పేరుతో వేల కోట్లు దోచేశారన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, ఇళ్ల స్థలాల కొనుగోలు, మద్యం అమ్మకాలు, 22(ఏ), అసైన్డ్ భూముల కుంభకోణాల పేరుతో లక్షల కోట్లు కూడబెట్టుకున్నారని మంత్రి సవిత ఆరోపించారు.

**రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు**

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబుపై ఏపీ అప్పులతో బకాయిలు గుదిబండగా మారాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ అసమర్థత కారణంగా ఒకవైపు బకాయిలు చెల్లిస్తూనే, అసలు, వడ్డీ కూడా తమ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. గడిచిన ఏడు నెలల్లో రూ.22 వేల కోట్లను ఫీజు రియింబర్స్ మెంట్, ధాన్యం కొనుగోలు, ఆరోగ్య శ్రీ బకాయిలను సీఎం చంద్రబాబునాయుడు చెల్లించారన్నారు. జగన్ చేసిన నిర్వాకంతో రాష్ట్రానికి అప్పులు కూడా వుట్టని పరిస్థితి నెలకొందన్నారు. అప్పులు ఊబిలో కూరుకుపోయిన ఏపీని అభివృద్ధిపథం వైపు నడిపించడానికి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోనూ ఒక వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక జగన్ సహా వైసీపీ నేతలు తప్పుడు కూతలు కూస్తూ, సొంత పత్రికలో విషపు రాతలు రాస్తూ రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రజలు విజ్ఞులని, జగన్ అవాకులు చవాకులు పట్టించుకోరని మంత్రి సవిత అభిప్రాయపడ్డారు.

# సింహాచలం భూముల క్రమబద్ధీకరణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భద్రత, భరోసా వచ్చిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పెట్టుబడిదారులను ఆహ్వానించేలా ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ మీడియాతో మాట్లాడారు. మంత్రి అనగాని మాట్లాడుతూ.. ఎవరి వల్ల మంచి జరుగుతుందో రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారు. ఎప్పటినుంచో ఉన్న సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తున్నాం సింహాచలం పంచగ్రామాల సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కాబోతోంది దాదావు 500 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చి 12149 ఇళ్లను రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. గతంలో (2018–19)లో జీవో నెం.225 ఇచ్చాం. ఎంత భూమి ఆక్రమణకు గురైందో.. దానికి సమానంగా భూమి ఇచ్చేందుకు ఆనాడు నిర్ణయించారు. జీవో రాగానే కొంత మంది కోర్టుకు వెళ్లారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేకపోయింది. సుమారు 12,149 కుటుంబాలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా వైకాపా ప్రభుత్వం చేయలేకపోయింది.సింహాచలం భూములను ఆక్రమించి 12,149 ఇళ్లను నిర్మించుకున్నారు. వాటి క్రమబద్ధీకరణకు గతంలోనూ ప్రయత్నాలు చేశాం. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకున్నాం. దీని రిజిస్ట్రేషన్ విలువ రూ.5,300 కోట్ల వరకూ ఉంది. పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నాం. దేవస్థానానికి చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నామని చెప్పారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ కోట్లు దోచుకున్నాడు



అమరావతి: వైసీపీ అధినేత జగన్ రెడ్డి జల్సాలు, అవినీతితో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమకు న్యాయం చేయాలంటూ.. రాష్ట్రం నలుమూలల నుంచి జగన్ బాధితులు ఎన్టీఆర్ భవన్ కు బారులు తీరుతున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ భూ దందాలు, ఆర్థిక నేరాల నుంచి తమకు న్యాయం చేయాలంటూ బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలకులు ఉద్దేశపూర్వకంగా చేసిన అక్రమాలకు ప్రజలు బలయ్యారని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కమీషన్ల పాలన, ఆర్థిక నేరాలతో రాష్ట్రం దివాళా దీసే పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి కుటుంబం రూ.8 లక్షల కోట్లు దోచుకుందని ఆరోపించారు. జగన్ దుబారా, జల్సాలకు ప్రభుత్వ ధనం రూ.19,871 కోట్లు వృథా చేశారన్నారు. ప్రచార పిచ్చితో సాక్షి పత్రికకు రూ. 1,600 కోట్ల ప్రజాధనాన్ని కట్టబెట్టారని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. జగన్ రెడ్డి బొక్కేసిన ఎగ్ పఫ్ల ఖర్చే అక్షరాలా రూ. 3 కోట్లని వ్యాఖ్యానించారు.

# వర్షాధార భూములకు వర ప్రసాదంగా ప్రకృతి వ్యవసాయం

## అనంతపురంలో పర్యటిస్తున్న శ్రీలంక ప్రతినిధి బృందం




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వర్షాధార పొలాలు అధిక సంఖ్యలో ఉన్న అనంతపురము వంటి జిల్లాలలో ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని, కరవు నేలలలో కూడా ప్రకృతి వ్యవసాయం అద్భుత ఫలితాలు అందిస్తోందని రైతు సాధికార సంస్థ ఛీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ ఆఫీసర్ , ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ లక్ష్మానాయక్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని పరిశీలించే కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న శ్రీలంక ప్రతినిధి బృందంతో లక్ష్మానాయక్ బుధవారం ఏపీసీఎన్ఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పై శ్రీలంక ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన కలిగించే క్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలుతీరు గురించి వివరించారు. కార్యక్రమ అమలులో మహిళా సంఘాలు గణనీయమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ అమలులో భాగంగా వినియోగించే జీవ ఉత్ప్రేరకాల గురించి వివరించారు. ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్, కిచెన్ గార్డెన్, కాషాయాల తయారీ, ఉపయోగాల గురించి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిలో వస్తున్న మార్పులు , దిగుబడులు, మార్కెటింగ్ , టెక్నాలజీ తదితర అంశాల గురించి తెలిపారు. పిఎండీఎస్ (మిల్లెట్స్, నూనెజాతి, తీగజాతి) ద్వారా నేలలో అన్నిరకాల పోషక విలువలు పెరగడంతో పాటు ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. పశుగ్రాసంతో పాటు కూరగాయలు , ఆకుకూరల దిగుబడి వస్తుందన్నారు. నేలలో పోషకాలతో పాటు వానపాములు అభివృద్ధి చెంది నేల గుల్లబారడం, సూక్ష్మ జీవులు పెరగడం జరుగుతుందన్నారు.

అనంతపురము ప్రాంతంలో వాతావరణం లో చాలా మార్పులూ ఉంటాయని , సకాలంలో వర్షాలు ఉండవని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతపురం జిల్లాలో జరిగే ప్రకృతి వ్యవసాయం విధానాన్ని అధ్యయనం చేసి శ్రీలంకలో మొదలు పెట్టాలన్నారు. ఇక్కడ నాలెడ్జ్ తో మీతో పాటు మా రాష్ట్రంలో నిష్ణాతులైన రైతులను శ్రీలంకకు పంపించి ప్రాక్టీస్ చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం వల్ల ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణం మార్పులు తట్టుకునే శక్తి లభిస్తుందని తెలిపారు ఈ వ్యవసాయ విధనం ద్వారా భూమి, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గించవచ్చొన్నారు. దీంతో ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణం లో మార్పులు, అనారోగ్య సమస్యల నుంచి తట్టుకోవచ్చన్నారు. అనంతరం శ్రీలంక బృందం తమ అనుమానాలను నివృత్తి చేసుకొన్నారు.

అనంతరం కూడేరు మండలం జెల్లిపల్లి గ్రామం లో రైతు ఆదినారాయణ పొలం లో సాగుచేసిన గ్రీన్ ద్రాక్ష తోట, మామిడి తోట పరిశీలించారు. అక్కడే ఘన, ద్రవ జీవామృతం ల తయారీ విధానం డెమో ద్వారా డీపీఎం ప్రదర్శించారు.అనంతరం శ్రీలంక ప్రతినిధి బృందం కూడేరు మండలంలోని జెల్లిపల్లి గ్రామంలో పర్యటించింది. శ్రీలంకలోని సర్వోదయ శ్రమదాన ఉద్యమ సుస్థిర అభివృద్ధి విభాగం బృందం వెంట రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ మధుప్రీతి, జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ఏ. ఓ కృష్ణ చైతన్య , కన్సల్టెంట్ నరేంద్ర, ప్రాజెక్టు మేనేజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

## రెండు రాష్ట్రాల్లో మొత్తం ఆరు స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల




తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రెండు రాష్ట్రాల్లో మొత్తం ఆరు స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు తెలంగాణ ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. మార్చి 3న ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 3న ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పింది. ఫిబ్రవరి 3 నుంచి 10 వరకూ నామినేషన్ల స్వీకరించనున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 11న స్క్రూటినీ నిర్వహించనున్నట్లు తెలిపింది. నామినేషన్ ఉపసంహరణకు ఫిబ్రవరి 13 చివరి తేదీ అని పేర్కొంది. కాగా, ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించి మార్చి 3న ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రకటన జారీ చేసింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. కాగా, ఖాళీ కానున్న ఈ మూడు స్థానాలకు ప్రస్తుతం జీవన్ రెడ్డి, కూర రఘోత్తమ్ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు షెడ్యూల్ విడుదల అయ్యింది. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహించి మార్చి 3న ఓట్ల లెక్కింపు చేయనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. నోటిఫికేషన్ విడుదలైన తక్షణ మే ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని ఎలెక్షన్ కమిషన్ ప్రకటన జారీ చేసింది. కాగా, ఏపీలో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గాలకు, శ్రీకా కుళం, విజయనగరం, విశాఖపట్నం టీచర్స్ స్థానానికి పోలింగ్ జరగనుంది.

# డిజిటల్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనలు

● అభ్యర్థన లేఖ అందించిన డిజిటల్ మీడియా జర్నలిస్టు నాయకులు

● ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన ఐ అండ్ పీఆర్ కమిషనర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రతిక్షణం ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్న ఆన్లైన్ న్యూస్ మీడియా(వెబ్సైట్, యాప్)కు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలంటూ తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్ హరీష్కు విజ్ఞప్తి చేశారు తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు స్వామి ముద్దం, పోతు అశోక్. ఈ మేరకు ఆన్లైన్ మీడియాకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాల్సిన అవసరాన్ని తెలువుతూ లేఖ అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఐ అండ్ పీఆర్ కమిషనర్.. త్వరలోనే ఆన్లైన్ మీడియా(వెబ్సైట్, యాప్)కు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చే ప్రక్రియ షురూ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు స్వామి ముద్దం మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా డిజిటల్ మీడియా రంగం కీలక పాత్ర వహిస్తుందన్నారు. ఈ కొత్త మాధ్యమంలో అనేక మంది జర్నలిస్టులు పని చేస్తున్నారని చెప్పారు. ఆన్లైన్ న్యూస్ మీడియాకు గుర్తింపును ఇస్తూ ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చి సహకరించాలని ఐ అండ్ పీ ఆర్ కమిషనర్కు విజ్ఞప్తి చేశామని చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించి, ఆ ప్రక్రియ ప్రారంభిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడం సంతోషకరమని, ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆన్లైన్ న్యూస్ మీడియాకు తెలంగాణ మీడియా ఆకాడమీ అక్రిడిటేషన్లు ఇచ్చేందుకు గైడ్లైన్స్ రూపొందించడం కొత్త మీడియా జర్నలిస్టులకు శుభపరిణామమని చెప్పారు.

## జేఎన్టీయూ హెచ్ విశ్వ విద్యాలయంలో సమస్యలు పరిష్కరించాలి

### జేఎన్టీయూహ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్ నాయక్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జేఎన్టీయూ విశ్వ విద్యాలయంలో సమస్యలను పరిష్కరించాలని బుధవారం జేఎన్టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో.. జేఎన్టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం నాయకులు భూక్యా రాజ్ కుమార్ మరియ ధరావత్ వినోద్ నాయక్ జేఎన్టీయూ హెచ్ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.విద్యార్థుల సమస్యలను తమ దృష్టికి తీసుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నేనావత్ శశి కుమార్, ధరావత్ సింహాద్రి,మోహిత్ నాయక్, కార్తీక్,సాయికిరణ్,భూక్యా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల సాధికారత కోసం సేవా భారతి రన్ కార్యక్రమం

# ఫిబ్రవరి 2న... రన్ ఫర్ గర్ల్ చైల్డ్

### అండగా నిలిచిన పలు కార్పొరేట్ కంపెనీలు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సమాజ సేవకు, సంక్షేమానికి అంకితమైన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ, సేవా భారతి తన వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' 9వ ఎడిషన్ ను 2025 ఫిబ్రవరి 02 ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నది. ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, టీ షర్ట్స్, బిబ్స్ ను ఫ్రీడమ్ ఆయిల్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జీ ఎం చేతన్, గ్లోబల్ డాటా డైరెక్టర్ స్వప్న మహేరియా, ప్రసన్న కాంత్, సేవా భారతి ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత, సంయుక్త కార్యదర్శి జయప్రద, సైబరాబాద్ సేవా భారతి అధ్యక్షురాలు ఉషా అయ్యర్, రన్ అంబాసిడర్ సరిత నర్మెట్ట, శ్రీనివాస్ తాడూరి, అఖిల్ తదితరులు హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి, చేతన్ మాట్లాడుతూ, ఈ రన్ లో పాల్గొనేందుకు ఇప్పటికే 10 వేల మంది తమ పేరు నమోదు చేసుకున్నారన్నారు. సామాజిక బాధ్యతగా సేవా భారతి సంస్థ సేవలకు సహకారంగా ఉంటున్నదుకు గర్వపడుతున్నామన్నారు. స్వప్న మహేరియా, ప్రసన్న కాంత్లు మాట్లాడుతూ, సేవా భారతి సేవలను కొనియాడారు. బాలికల సాధికారత కోసం ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. అందుకు మా సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. జయప్రద దేవి మాట్లాడుతూ, 2004 లో కేవలం 11 కేంద్రాలతో ప్రారంభమై, ఇవ్వాళ 300 కిషోరీ వికాస కేంద్రాలను ఏర్పాటు చేశాం అన్నారు. డాక్టర్ సుమలత మాట్లాడుతూ, సమాజంలో ఉన్న అవసరాలను బట్టి వివిధ రంగాల్లో సేవా భారతి సేవలు అందిస్తున్నది. ఫిబ్రవరి 2న, గచ్చిబౌలి లో జరిగే 9వ విడత రన్ ఫర్ గర్ల్ చైల్డ్, మరియు ఫిబ్రవరి 1న అద్భుతంగా ఉండే ఉడాన్ ఉత్సవంలో పాల్గొనాలని, అదే ఉత్సవంలో రన్నర్స్ కు టీ షర్ట్స్, బిబ్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయాన్ని సేవాభారతి కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్లోని మురికి వాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు ప్రతి ఏడాది 10 వేల మంది బాలికలకు సాధికారత కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి లక్ష మంది ఆడపిల్లలకు భవిష్యత్ ప్రణాళికల ద్వారా సాధికారత సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ రన్కు సహకరిస్తున్న ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్ డేటా, ఇన్ఫోసిస్, పాల్ టెక్, జీఈపీ, హెల్త్ ఎడ్జ్, ఫిల్ట్రేషన్ గ్రూప్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్, బీడీఎల్ వంటి సంస్థలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల ద్వారా తర్వాత జరిగే రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో పాల్గొనాలని వివిధ కార్పొరేట్ సంస్థలను కోరారు.

## తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులు రావడం

# అభినందనీయం

### టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జే.దశరథ్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులు రావడం అభినందనీయమని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జే.దశరథ్ తన అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ కంపెనీ సీఈవోలతో దావోసు లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొని లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేలా కృషి చేశారని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి పెట్టుబడులను తీసుకు రావడం చాలా హర్శించదగ్గ విషయం అన్నారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు తో వారు ఎప్పటికప్పుడు రివ్యూ చేసి ఆయా కంపెనీలను ఆకర్షించడానికి పాటుపడ్డారని తెలియజేశారు. కరోనా వచ్చిన తర్వాత అనేక కంపెనీలు మూత పడ్డాయని ఈసందర్భంగా దశరథ్ పేర్కొన్నారు ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో చదువుకొన్న విద్యార్థినీ, విద్యార్థులు అయోమయ పరిస్థితిలో ఉన్నారని దశరథ్ పేర్కొన్నారు. వివిధ రకాల కంపెనీలు తీసుకు రావడం కోసం కోసం నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు కీ రోల్ పాత్ర పోషించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో మారుమూల గ్రామంలో సైతం పలు కంపెనీలు తీసుకు రానున్న విషయాన్ని దశరథ్ తెలిపారు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టాటా కాన్సెల్ట్ ను విశాఖ నగరంలో పది వేల ఉద్యగాలు అట్లాగే గ్రీన్. కంపనీ ద్వారా పదహారు వేల ఐదు వందల కోట్లు తో .4.825.మందికి ఉద్యోగాలు అట్లాగే ఎక్రీన్ అనంతపూర్ 5.67.కోట్లతో 170.మందికి ఉద్యోగాలు అట్లాగే టాటా పవర్ అనంతపూర్ లో2000.కోట్లతో.1380.ఉద్యోగాలు.అట్లాగే టాటా ఎంటర్ ప్రైజ్ కడపలో 8250 ఉద్యోగాల కల్పనకై కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్రం బీహార్కు, ఏపీకి ఇచ్చిన ప్రాధాన్యత

# తెలంగాణకు ఇవ్వట్లేదు

● బండి సంజయ్ కార్పొరేటర్ కాదు కేంద్ర మంత్రి అని గుర్తు పెట్టుకోవాలి

● హరీష్ రావు ముందు కేసీఆర్ ను ప్రజలకు దర్శనం ఇవ్వాలని చెప్పాలి ● భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: పద్మ శ్రీ అవార్డుల విషయంలో పార్లమెంట్ జీరో అవర్ లో లెవనెత్తుతా అని అన్నారు భువనగిరి ఎంపీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్ కార్పొరేటర్ కాదు కేంద్ర మంత్రి అని గుర్తు పెట్టుకోవాలని, హరీష్ రావు ముందు కేసీఆర్ ను ప్రజలకు దర్శనం ఇవ్వాలని చెప్పాలన్నారు చామల కిరణ్ కుమార్. కేంద్రం బీహార్కు, ఏపీకి ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వట్లేదని ఆయన మండిపడ్డారు. అందుకే బడ్జెట్ లో మొండి చేయి చూపిస్తున్నారని, ఈ సారి అయిన లోకసభలో విభజన హామీల గురించి బీజేపీ ఎంపీలు మాట్లాడాలన్నారు చామల కిరణ్ కుమార్ రెడ్డి. అంతేకాకుండా.. రాష్ట్రం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని సార్లు డిల్లికి పోయాడో కేటిఆర్ ను అడిగితే వ్యంగ్యంగా చెప్తాడని, ఆదిలాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి మోడీని రాష్ట్రానికి పెద్దన్న లాగ ఉండమన్నారని, కాంగ్రెస్ లో 8మంది ఎంపీలు ఉన్నారన్నారు. తెలంగాణ ప్రజలు 8మంది బీజేపీ ఎంపిలను గెలిపించారని, మిమ్ముల్ని గెలిపించింది ఎందుకు అని ఆయన వ్యాఖ్యానించారు. లక్ష్మణ్ రాజ్య సభ ఎంపీగా ఉండి ఆర్ఆర్ఆర్పై భువనగిరి పోయి ఫిర్యాదు చేయడం పై వాళ్ల వైఖరి అర్థం చేసుకోవచ్చన్నారు చామల కిరణ్ కుమార్. హైదరాబాద్ ట్రిపుల్ ఆర్ కోసం కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కలిశారని, ఆర్ఆర్ఆర్ హైదరాబాద్ లైఫ్ లైన్ దానికి 45వేల కోట్లు అవసరమన్నారు. రిజనల్ రింగ్ రోడ్డు, మెట్రో తో హైదరాబాద్ గ్లోబల్ సిటీ అవుతుందన్నారు. అంతేకాకుండా..పద్మ అవార్డుల విషయంలో బండి సంజయ్ బాధ్యత రహిత్యంగా మాట్లాడిండు.. కిషన్ రెడ్డి దావోస్ పర్యటన ను , కంపెనీలను నెగెటివ్ ప్రచారం చేస్తుండు.. నల్లగొండలో రైతులు ఎవ్వరు కేటీఆర్ ధర్నా ను పట్టించుకోలేదు.. మూసీ కోసం పార్లమెంట్ లో ఎంపీలందరం కొట్లాడాలి.. మహారాష్ట్ర కంటే మన రాష్ట్రం ఎక్కువగా కేంద్రానికి జీఎస్టీ పే చేస్తుంది. పది ఏండ్లు రాష్ట్రానికి రావాల్సిన నిధులను రప్పించడంలో బీఆర్ఎస్ విఫలమైంది.. హైదరాబాద్ లో గ్రీన్ ఫీల్డ్ హైవే ,డ్రై పోర్ట్ పెట్టబోతున్నాం.. పార్టీ ఏ అవకాశం ఇచ్చినా స్వీకరిస్తా అని చామల కిరణ్ కుమార్ వ్యాఖ్యానించారు.

## ఇంకో 2 మ్యాచుల్లో ఛాన్స్ ఇస్తే చాలు



భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ అంతర్జాతీయ క్రికెట్లో పునరాగమనం చేసిన మ్యాచ్లో ఒక్క వికెట్ తీయలేదు. దాదాపు 14 నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్లోకి భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ పునరాగమనం చేశాడు. గత వన్డే ప్రపంచ కప్ తర్వాత మోకాలికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్లో చోటు దక్కించుకున్న షమీని ఇంగ్లండ్తో టీ20 సిరీస్ కూ భారత మేనేజ్మెంట్ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. తొలి రెండు టీ20ల్లో ఆడే అవకాశం రాలేదు. మూడో మ్యాచ్లో ఆడినా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. కానీ, అతడి రన్నప్ బాగుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభినందించాడు. తాజాగా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కూడా షమీకి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని.. అప్పుడే బౌలింగ్లో రిథమ్ను సాధించేందుకు వీలుంటుందని పేర్కొన్నాడు. గాయం నుంచి కోలుకుని వచ్చాక సాధారణ స్థితికి రావడం చాలా కష్టమని తెలిపాడు. "బౌలింగ్ చేసేటప్పుడు మంచి రన్నప్ ఉంటే రిథమ్ దొరుకుతుంది. ఇప్పుడు క్రీజ్ వద్దకు చాలా మంచి వేగంతో వచ్చాడు. కానీ, గతంలో ఉన్నట్లు బౌలింగ్ మెరుగ్గా లేదనిపిస్తోంది. అయితే, గాయం నుంచి కోలుకుని వచ్చాక శరీరం కదలికల్లో మార్పులు ఉంటాయి. వాటన్నింటిని సరైన దారిలో పెట్టుకోవడానికి కాస్త సమయం పడుతుంది. దేశవాళీలో షమీ నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. ఇప్పుడు షమీ బాడీ కూడా చాలా బాగుంది. బౌలింగ్లో లయను అందుకోవడానికి అదనంగా శ్రమించాలి. ఇంగ్లండ్తో పొట్టి సిరీస్లో మరో రెండు మ్యాచ్లు మిగిలి ఉన్నాయి. వాటిల్లో అతడిని ఆడించాలి. తప్పకుండా రిథమ్ అందుకొంటాడు" అని రాయుడు వెల్లడించాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్ టాప్-5లో వరుణ్ చక్రవర్తి



టీమ్ఇండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం సూపర్ఫామ్లో ఉన్నాడు. ఇంగ్లాండ్తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్లో అతను అదరగొడుతున్నాడు. మంగళవారం ఇంగ్లీష్ జట్టుతో జరిగిన మూడో టీ20లో వరుణ్ 24 పరుగులే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్లో భారత్ ఓటమిపాలైనప్పటికీ వరుణ్ చక్రవర్తి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు. ఈ సూపర్ పెర్ఫామెన్స్తో ఐసీసీ ర్యాంకింగ్స్లో కెరీర్లోనే అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. అతను ఏకంగా 25 స్థానాలు ఎగబాకి ఐదో స్థానంలో నిలిచాడు.

ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఒక స్థానం మెరుగై తిరిగి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఇంగ్లీష్ జట్టు పేసర్ జోఫ్రా ఆర్చర్ 13 స్థానాలు జంప్ చేసి ఆరో ర్యాంకు సాధించాడు. భారత ఫాస్ట్బౌలర్ అర్ష్దీప్ సింగ్ తొమ్మిదో స్థానంలో ఉండగా.. రవి బిష్ణోయ్ ఐదు స్థానాలు దిగజారి 10వ ర్యాంకుకు పడిపోయాడు. అక్షర్ పటేల్ ఐదు స్థానాలు మెరుగై 11వ ర్యాంకు దక్కించుకున్నాడు. టీ20ల్లో బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తిలక్ వర్మ ఒక స్థానం మెరుగై ఫిల్ సాల్ట్ను వెనక్కినెట్టి రెండో ర్యాంక్లో నిలిచాడు. సూర్యకుమార్ యాదవ్, జోస్ బట్లర్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు.

**ఐసీసీ టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్ :** ఆదిల్ రషీద్ – 718 రేటింగ్ పాయింట్లు, అకీల్ హొసేన్ – 707 రేటింగ్ పాయింట్లు, వానిందు హసరంగ – 698 రేటింగ్ పాయింట్లు, ఆడమ్ జంపా – 694 రేటింగ్ పాయింట్లు, వరుణ్ చక్రవర్తి %–% 679 రేటింగ్ పాయింట్లు (కెరీర్–బెస్ట్)

# సూర్యకు డేంజర్ బెల్స్



ఏదో సినిమాలో ఓ డైలాగ్ ఉంటుంది.. 'వీడికి ఒక్కోసారి బ్రహ్మాండంగా మార్కులు వచ్చేస్తాయి. మరోసారి గుండు సున్నాలొస్తాయ్. తెలివైనోడో.. తెలివిలేనోడో అర్థం కావడం లేదు' అని ఓ పాత్ర సంభాషణ. ఇప్పుడు ఇది ఎందుకు గుర్తుకొచ్చిందంటారా? ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ఆటతీరును చూస్తుంటే అలానే అనిపిస్తోంది. భారత 'మిస్టర్ 360'గా పేరొందిన సూర్యకుమార్ యాదవ్ ఒకప్పుడు క్రీజ్లోకి వచ్చాడంటే ప్రత్యర్థులకు హడల్.. ఇప్పుడు మాత్రం ఒకటో, రెండో బౌండరీలు కొట్టేసి ఔటవుతాడులే అనే భావన మొదలైంది. 1, 0, 0, 12, 14.. ఇవీ భారత టీ20 క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ గత ఐదు ఇన్నింగ్స్లో చేసిన పరుగులు. కెప్టెన్గా జట్టు విజయాల్లో పాత్ర పోషిస్తోన్న అతడు.. బ్యాటర్గా మాత్రం అస్సలు ప్రభావం చూపించడం లేదు.

యువ బ్యాటర్ అభిషేక్ శర్మ దుమ్ము రేపేస్తున్నాడు. హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ జట్టును గెలిపిస్తున్నాడు. కానీ, కెప్టెన్ సూర్య మాత్రం ఏమాత్రం ప్రభావం చూపించడం లేదు. జట్టు పరిస్థితిని అంచనా వేసి ఆడాల్సిన సమయంలోనూ తన షాట్లనే ప్రయోగిస్తూ ప్రత్యర్థికి దొరికిపోయాడు. ఇంగ్లండ్తో మూడు మ్యాచుల్లోనూ దాదాపు ఒకే తీరుగా పెవిలియన్కు చేరాడు. అతడిని లక్ష్యంగా చేసుకొని షార్ట్ పిచ్ బంతులతో ఊరించి ఔట్ చేశారు. లెగ్సైడ్ ఫ్లిక్ షాట్లతో బౌండరీలు రాబడదామని ప్రయత్నించిన సూర్య విఫలం కావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో ఇలాంటి షాట్లను అలవోకగా బాదేసిన సూర్యనేనా? మనం చూసింది అనే అనుమానం కలగకమానదు. కెప్టెన్ అయిన తర్వాత అతడు అనవసర ఒత్తిడిగా భావిస్తున్నట్లుందని క్రికెట్ వర్గాల మాట.

గత టీ20 ప్రపంచకప్ను భారత్ నెగ్గిన తర్వాత.. అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్కు కెప్టెన్ రోహిత్ శర్మ వీడ్కోలు పలికాడు. గతేడాది జింబాబ్వేతో టీ20 సిరీస్కు శుభ్మన్ గిల్ కెప్టెన్గా చేశాడు. ఆ తర్వాత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వ స్థానంపై పెద్దఎత్తున కసరత్తు చేశాడు. స్వదేశంలో బంగ్లాదేశ్తో టీ20 సిరీస్కు గిల్, హార్దిక్ను కాదని.. సూర్యకుమార్ యాదవ్కు మేనేజ్మెంట్ సారథ్య బాధ్యతలు అప్పగించింది. అప్పట్నుంచే అతడిని పూర్తిస్థాయి కెప్టెన్గా నియమించింది. ఆ మూడు మ్యాచుల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్గా నిలిచాడు. కెప్టెన్గానూ సక్సెస్ అయ్యాడు. ఆ సిరీస్ను సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత శ్రీలంకపైనా సిరీస్ను భారత్కు అందించాడు. గత నవంబర్లో దక్షిణాఫ్రికా పర్యటనకు టీమ్ఇండియా వెళ్లింది. సిరీస్ను 3–1 తేడాతో టీమ్ఇండియా గెలుచుకుంది. జట్టుపరంగా అభిమానులకు సంతృప్తి ఇచ్చిన ఫలితమే. ఇక్కడినుంచే సూర్య బ్యాటింగ్ దారుణంగా పడిపోయింది. వ్యక్తిగత ప్రదర్శనకు వచ్చేసరికి సూర్య తేలిపోయాడు. నాలుగు మ్యాచుల్లో కేవలం 26 పరుగులే చేశాడు. తిలక్ వర్మ, సంజుశాంసన్ దంచేయడంతో ఆ సిరీస్ను భారత్ గెలుచుకుంది. అత్యంత దారుణమైన విషయం ఏంటంటే.. సఫారీ జట్టు బౌలర్ కమ్ బ్యాటర్ మార్కో ఎన్సెన్ కంటే సూర్య తక్కువ పరుగులు చేయడం. ఎన్సెన్ 4 మ్యాచుల్లో 102 పరుగులు చేశాడు. ఇప్పుడు మళ్లీ ఇంగ్లండ్తో సిరీస్లోనూ తడబాటుకు గురికావడం అభిమానులను మరింత బాధిస్తోంది. కెప్టెన్సీ చేపట్టకముందు 70 మ్యాచుల్లో 2400ం పరుగులు చేసిన అతడు.. ఆ తర్వాత 11 మ్యాచుల్లో కేవలం 180ం పరుగులు మాత్రమే చేయడం గమనార్హం.

టీ20ల్లో దూకుడు అత్యంత ముఖ్యమే. కానీ, నిలకడైన ఆటతీరు కూడా అవసరమే. ఒకరిద్దరు రాణిస్తే సిరీస్ను గెలిచేద్దామనుకుంటే ఎల్లవేళలా సాగదు. అందుకు ఉదాహరణ ఇంగ్లండ్తో టీ20 సిరీస్. తొలి రెండు మ్యాచుల్లో అభిషేక్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించారు. మూడో మ్యాచ్లో అలా ఆడే ప్లేయర్ లేకపోవడంతో ఓటమి తప్పలేదు. ఆ బాధ్యతలను కెప్టెన్గా సూర్య తీసుకోవాలనేది క్రికెట్ విశ్లేషకుల సూచన. ప్రతిసారీ అదే తరహా షాట్లను కొట్టేసి పరుగులు రాబడదామనుకుంటే కష్టమవుతుంది. పరిస్థితులకు తగ్గట్టు.. అవతల బౌలర్లకు పిచ్ నుంచి అందుతోన్న సహకారాన్ని బట్టి ఆడాల్సి ఉంటుంది. మ్యాచ్ మన చేతుల్లోకి వచ్చాక.. అలాంటి షాట్లు ఆడినా ఫర్వాలేదు. అలాకాకుండా క్లిష్ట సమయంలోనూ 'నా తీరులోనే' ఆడతానంటే కష్టమే. ఈ లాజిక్ను మిస్ కావడం వల్లే సూర్య పరుగులు చేయడంలో విఫలమవుతున్నాడనేది క్రీడా పండితుల విశ్లేషణ.

భవిష్యత్తులో పొట్టి కప్ బరిలో దిగే భారత జట్టుకు సూర్య నాయకత్వం వహించాలని భావిస్తే మాత్రం బ్యాటింగ్లోనూ ఫామ్లోకి రావాల్సిందే. టీమ్ఇండియాలో ప్రతి బాధ్యతకూ తీవ్ర పోటీ ఉంది. అయితే, వచ్చే ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే భారత జట్టులో చోటు దక్కకపోవడమూ అతడిని మానసికంగా ఇబ్బందికి గురిచేస్తోందనే వాదనా లేకపోలేదు. ఏదిఏమైనా సరే సూర్యకుమార్ తన ఆటతోనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# మరో రికార్డు సృష్టించిన బూమ్ బూమ్ బుమ్రా!

## సచిన్, ద్రావిడ్ లతో సమానం



భారత క్రికెట్ జట్టు ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన అద్భుతమైన ప్రదర్శనతో %×జజ% పురుషుల క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. అయితే బుమ్రా అవార్డుల విషయంలో ఇంతటితో ఆగలేదు తాజాగా అతను ప్రతిష్టాత్మక సర్ గార్ఫీల్డ్ సోబర్స్ అవార్డుతో సత్కరించబడ్డాడు. ఇది బుమ్రా అసమాన ప్రతిభకు గుర్తింపు. బుమ్రా ట్రావిస్ హెడ్, జో రూట్, హ్యారీ బ్రూక్ లను ఓడించి ఈ గౌరవాన్ని పొందాడు. అతను ఈ పురస్కారాన్ని గెలుచుకున్న ఐదవ భారతీయ క్రికెటర్ అయ్యాడు. బుమ్రా కంటే ముందు రాహుల్ ద్రవిడ్ (2004), సచిన్ టెండూల్కర్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2017, 2018) ఈ గౌరవాన్ని పొందారు.

**రికార్డులపై రికార్డులు :** 2024లో బుమ్రా ప్రదర్శన అద్భుతం, టెస్టు క్రికెట్లో అతను అత్యుత్తమమైన 14.92 సగటుతో 71 వికెట్లు సాధించాడు. బుమ్రా 200 టెస్ట్ వికెట్లు అందుకున్న వేగవంతమైన భారత పేసర్ అయ్యాడు. %×జజ% టెస్ట్ ర్యాంకింగ్స్లో నం.1 స్థానాన్ని కూడా దక్కించుకున్నాడు. 900–పాయింట్ మార్కును అధిగమించిన తొలి భారత బౌలర్, 907 పాయింట్లతో ఏడాది ముగించాడు, ఇది ఏ భారతీయ బౌలర్ సాధించని గొప్ప రికార్డు. %ు%20 వరల్డ్ కప్లో భారత జట్టు విజయానికి కీలకంగా మారి 8.26 సగటుతో 15 వికెట్లు తీసి అత్యుత్తమ 4.17 ఎకానమీ రేటును నమోదు చేశాడు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై మొత్తం 32 వికెట్లు తీశాడు. ఇంగ్లండ్తో టెస్టు సిరీస్లో కీలక వికెట్లు పడగొట్టాడు, అందులో వైజాగ్లో ఆలీ పోప్ను ఔట్ చేసిన దృశ్యం ప్రత్యేకంగా నిలిచింది. అవార్డు అందుకున్న అనంతరం బుమ్రా తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. "టెస్ట్ క్రికెట్ నా హృదయానికి ఎంతో దగ్గరగా ఉంది. ఈ గుర్తింపు ప్రత్యేకం," అని చెప్పాడు. "నా జట్టు విజయమే నా ప్రథమ లక్ష్యం. ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం నా గర్వకారణం" అని బుమ్రా తన హృదయపూర్వక కృతజ్ఞతలను తెలిపాడు.

జస్ప్రీత్ బుమ్రా 2024లో తన అద్భుతమైన ప్రదర్శనతో భారత క్రికెట్ను గర్వించగల స్థాయికి చేర్చాడు. అతని రికార్డులు, విజయాలు, పట్టుదల అతన్ని భారత క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప లెజెండరీ బౌలర్గా నిలిపాయి.

ఈ ఘనతను అందుకున్నా, బుమ్రా తన ప్రయాణాన్ని ఇక్కడితో ఆపదలుచుకోలేదు. "ఇదే నా ప్రస్థానానికి కొత్త శకం. ముందు వచ్చే ఛాలెంజ్లను ఎదుర్కొని, భారత జట్టుకు మరిన్ని విజయాలు అందించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని చెప్పాడు. 2025 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్, టీ20 ప్రపంచ కప్ ఇతర అంతర్జాతీయ టోర్నమెంట్లలో భారత క్రికెట్ విజయాల్లో కీలక పాత్ర పోషించాలనే సంకల్పంతో ఉన్నాడు.

## టీమిండియాలో ఇద్దరు ప్లేయర్లను మార్చకపోతే

# సిరీస్ గోవిందా!



భారత క్రికెట్ జట్టు, టీ20 సిరీస్ అప్డేట్స్, షమి రీఎంట్రీ, సూర్యకుమార్ యాదవ్, రాజ్కోట్ మ్యాచ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుని 171 రన్స్కే ఇంగ్లాండ్ను కట్టడి చేసినప్పటికీ, ఛేజింగ్లో మనోళ్లు తేలిపోయారు. అయితే, ఇప్పటివరకు జరిగిన మూడు టీ20లను పరిశీలిస్తే ఇద్దరు ఇండియన్ క్రికెటర్లు టీమ్లో ఉండి లాభం లేదనిపిస్తోంది. మరోవైపు, ఓ ప్లేయర్ మాత్రం భవిష్యత్ ఆశలు పెంచుతున్నాడు. వారెవరో చూద్దాం.

**ఫ్లాప్స్టార్ రవి బిష్ణోయ్ :** స్పిన్కు అనుకూలించే ఇండియన్ పిచ్ల మీద రెండో స్పెషలిస్టు స్పిన్నర్గా రవి బిష్ణోయ్ జట్టులోకి వచ్చాడు. కానీ, జీరో పర్ఫార్మెన్స్తో ఫ్యాన్స్ను నిరాశపరిచాడు. కోల్కతా, చెన్నై పిచ్లపై మిగతా స్పిన్నర్లు రెచ్చిపోతుంటే మనోడు మాత్రం కొంచెం కూడా ప్రభావం చూపించలేకపోయాడు. మొదటి రెండు టీ20ల్లో కనీసం ఒక్కటంటే ఒక్క వికెట్ కూడా తీయలేదు.

ఇక, రాజ్కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో రవి బిష్ణోయ్ పర్ఫార్మెన్స్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అసలే గెలవాలన్న కసితో ఊపుమీదున్న ఇంగ్లాండ్ బ్యాటర్లకు మనోడు చిక్కిపోయాడు. 4 ఓవర్లు వేసి ఏకంగా 46 రన్స్ ఇచ్చాడు. ఒక వికెట్ మాత్రమే పడగొట్టాడు. తన స్పెల్లో చివరి ఓవర్లో లివింగ్స్టోన్ 3 సిక్సర్లు బాదాడు. దీంతో ఇంగ్లాండ్ స్కోర్ బోర్డ్ బాగా పెరిగిపోయింది. తన లైన్ అండ్ లెంగ్త్ను రవి బిష్ణోయ్ ఇంప్రూవ్ చేసుకోవాల్సి ఉందని మాజీలు అభిప్రాయ పడుతున్నారు.

**జిడ్డు ప్లేయర్గా సుందర్ :** ఈ టీ20 సిరీస్లో వాషింగ్టన్ సుందర్ కూడా పూర్తిగా తేలిపోయాడు. రెండో టీ20తో జట్టులోకి వచ్చినా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. రెండో టీ20లో ఒక ఓవర్ వేసి వికెట్ తీశాడు. ఆ తర్వాత ఛేజింగ్లో కాస్త సాయపడ్డాడు. అయితే, మూడో టీ20లో మాత్రం పరమ జిడ్డు ప్లేయర్గా మారాడు. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్లో ఫెయిల్ అయ్యాడు. ఈ మ్యాచ్లో కూడా సుందర్ ఒకే ఓవర్ వేసి ఏకంగా 15 రన్స్ ఇచ్చాడు. దీంతో సుందర్కి బౌలింగ్ ఇవ్వకూడదని కెప్టెన్ డిసైడ్ అయిపోయాడు. ఆ తర్వాత ఛేజింగ్లో బ్యాటింగ్ ఆర్డర్లో ప్రమోషన్ ఇచ్చినా దానిని వాడుకోలేదు. టీ20 మ్యాచ్ ఆడుతున్నామని మర్చిపోయి టెస్టు మ్యాచ్లాగా ఆడాడు. 15 బంతులు ఆడి కేవలం 6 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో ఇండియాకు ఛేజింగ్ కష్టమైపోయింది. మరి, ఇలాంటి జిడ్డు ఆల్రౌండర్ టీమ్లో అవసరమా అనే విషయాన్ని కోచ్, కెప్టెన్ చర్చించుకోవాలి.

**ఫ్యూచర్ స్టార్.. వరుణ్ చక్రవర్తి :** ఈ టీ20 సిరీస్లో భారత ఫ్యాన్స్ సంతోషించదగ్గ విషయం ఏదైనా ఉందంటే.. అది వరుణ్ చక్రవర్తి పర్ఫార్మెన్సే. టీమిండియాలో ప్రధాన స్పిన్నర్ లోటును వరుణ్ పూడ్చేలా కనిపిస్తున్నాడు. తొలి టీ20 నుంచి బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నాడు. మూడో టీ20లో డేంజరస్ బ్యాటర్ బట్లర్ని ఔట్ చేసి టీమిండియాకు ఊరటనిచ్చాడు. ఆ తర్వాత మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లను ఔట్ చేసి ఇంగ్లాండ్ను తక్కువ టోటల్కే పరిమితం చేశాడు. మొత్తం మూడు మ్యాచుల్లో 10 వికెట్లు తీసి సిరీస్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గా నిలిచాడు. ఇలా మ్యాచ్ మ్యాచ్కు బెటర్ పర్ఫార్మెన్స్ ఇస్తూ టీమిండియా స్పిన్ దళానికి బ్యాక్ బోన్గా నిలుస్తున్నాడు.



# స్టీవ్ స్మిత్ అరుదైన ఘనత

## టెస్టుల్లో పది వేల రన్స్ పూర్తి



ఆస్ట్రేలియా తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్.. టెస్టు ఫార్మాట్లో అరుదైన ఘనత సాధించాడు. పది వేల పరుగుల మార్కును చేరుకున్న 15వ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. నిజానికి ఈనెల మొదటివారంలో భారత్తో సిడ్నీలో జరిగిన ఐదో టెస్టులోనే స్మిత్ ఈ ఘనత సాధించాల్సింది. అయితే ఆ మ్యాచ్లో నాలుగు పరుగులు మాత్రమే చేసిన స్మిత్.. భారత పేసర్ ప్రసిధ్ చేతిలో ఔటయ్యాడు. ఆ తర్వాత 22 రోజుల వరకు తను ఈ ఫీట్ను సాధించడం కోసం ఎదురు చూశాడు. తాజాగా శ్రీలంకతో బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో ఎదుర్కొన్న తొలి బంతినే సింగిల్ తీసి పది వేల పరుగుల మార్కును చేరుకున్నాడు. ప్రభాత్ జయసూర్య బౌలింగ్ లో మిడ్ వికెట్ దిశగా సింగిల్ తీసి ఈ ఘనత సాధించాడు. తన కెరీర్లో 205వ ఇన్నింగ్స్లో ఈ మార్కును చేరుకున్నాడు. దీంతో పది వేల పరుగుల మార్కును అత్యత వేగవంతంగా చేరుకున్న ఐదో బ్యాటర్గా నిలిచాడు.

**ఫస్ట్ ప్లేస్లో ఇద్దరు..** నిజానికి టెస్టుల్లో పది వేల పరుగుల క్లబ్బును ప్రారంభించింది భారత్కు చెందిన దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ కావడం విశేషం. 1987లో 37 ఏళ్ల ప్రాయంలో ఈ రికార్డును నెలకొల్పాడు. అయితే అత్యంత వేగంగా ఈ మార్కును చేరుకున్న ప్లేయర్లు ఇద్దరు ఉన్నారు. 2004లో ఇంగ్లాండ్ పై మాంచెస్టర్లో బ్రియన్ లార్ తొలుత ఈ రికార్డును చేరుకోగా, ఆ తర్వాత ఏడాదే భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. ఈడెన్ గార్డెన్ లో పాకిస్థాన్పై ఈ మార్కును చేరుకున్నారు. కేవలం 195 ఇన్నింగ్స్లోనే వీరిద్దరూ ఈ ఘనతను సాధించారు. ఆ తర్వాత కుమార సంగక్కర (196), స్టీవ్ స్మిత్ (206), రాహుల్ ద్రావిడ్ (206) తర్వాత స్థానాల్లో నిలిచారు.

**ఓవరాల్గా 15వ క్రికెటర్ స్మిత్..** ఇప్పటివరకు టెస్టుల్లో పది వేల పరుగుల మార్కును చేరుకున్న ఆటగాళ్లు 14 మంది ఉండగా, బుధవారం స్టీవ్ స్మిత్ ఆ జాబితాలో చేరాడు. దీంతో మొత్తం 15 మంది ఆటగాళ్లు అయ్యారు. ఇక టెస్టుల్లో పదివేల పరుగులు సాధించి, అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లను పరిశీలిస్తే, సచిన్ టెండూల్కర్ (15,921 పరుగులు), రికీ పాంటింగ్ (13,378), జాక్ కల్లిస్ (13,289), రాహుల్ ద్రావిడ్ (13,288), జో రూట్ (12,972), ఆలిస్టర్ కుక్ (12, 472), సంగక్కర (12,400), బ్రియాన్ లారా (11,867), శివ నారాయణ్ చంద్రపాల్ (11,867), మహేళ జయవర్ధనే (11,814), అలన్ బోర్డర్ (11,174), స్టీవ్ వా (10, 927), సునీల్ గావస్కర్ (10,122), యూనిస్ ఖాన్ (10,099), స్మిత్ (10,000ం పరుగులు) ఉన్నారు. ఇక పదివేల మార్కును చేరుకున్న నాలుగో ఆస్ట్రేలియన్ గా స్మిత్ రికార్డులకెక్కాడు. గతంలో అలన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్ ఈ ఘనత సాధించారు. ఇక శ్రీలంకతో జరుగుతున్న టెస్టులో కడపటి వార్తలందేసరికి అర్ధ సెంచరీని పూర్తి చేసిన స్మిత్.. ఈ మ్యాచ్లో సెంచరీ చేసి ఈ మ్యాచ్ ను మధురానుభూతిగా మార్చుకోవాలని భావిస్తున్నాడు.

suryachitramagazine@gmail.com


# సూర్య సినిమా

# ‘తండేల్’ లో చైతన్యది కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్: అల్లు అరవింద్

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘తండేల్’. ‘కార్తికేయ-2’ లాంటి బంపర్ హిట్ కొట్టిన డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వంలో సక్సెస్‌ఫుల్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్ ఓ రేంజ్‌లో చేస్తున్న చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామా టాకీస్ రోడ్డులోని శ్రీరామ పిక్చర్ ప్యాలెస్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేసింది. అభిమానుల మధ్య ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ వేడుకకు మెగా నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు హీరో అక్కినేని నాగచైతన్య హాజరయ్యారు. నాగచైతన్యకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ట్రైలర్ విషయానికి వస్తే.. లవ్ స్టోరీ తర్వాత జంటగా వచ్చిన నాగ చైతన్య, సాయిపల్లవి స్క్రీన్‌పై అదరగొట్టేశారు. నాగ చైతన్య, సాయి పల్లవి మధ్య అదిరిపోయిన కెమెస్ట్రీకి తోడు కాస్త దేశభక్తిని కూడా జోడించి డైరెక్టర్ చందూ మొండేటి ఈ సినిమాను భారీగా ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ ఇద్దరి నోటా ఉత్తరాంధ్ర యాస బాగా పలికింది. తండేల్ అంటే లీడర్ అనే విషయాన్ని ఈ ట్రైలర్ ద్వారా తెలియజేశారు. ‘రాజూ.. ఊళ్లో అందరూ మన గురించి ఏటేటో మాటాడుకుంటున్నారు రా’ అనే సాయి పల్లవి డైలాగుతో ట్రైలర్ మొదలవుతుంది. వాళ్లు అనుకుంటున్నదే నిజం చేసేద్దామని ఆమె అనగానే ఇద్దరి లవ్ స్టోరీ మొదలవుతుంది. అయితే తరచూ చేపల వేటకు వెళ్లే అతడు.. ఆమెకు దూరమవుతూ ఉంటాడు. కానీ ఓసారి పాకిస్థాన్ సరిహద్దుకు వెళ్లి అక్కడే చిక్కుకుపోతాడు. అక్కడితో ట్రైలర్ కాస్తా లవ్ ట్రాక్ నుంచి దేశభక్తి వైపు వెళ్తుంది. మా దేశంలోని ఊరకుక్కలన్నీ ఉత్తరం వైపు తిరిగి పోస్తే.. ప్రపంచ పటంలో పాకిస్థాన్ లేకుండా పోతుంది.. మా యాసను మాత్రం ఎటకారం చేస్తే రాజులమ్మ జాతరే అని రెండు పవర్ ఫుల్ డైలాగులు చైతూ నోటి వెంట వినిపిస్తాయి. మొత్తం ట్రైలర్ ఒక పవర్ ప్యాక్డ్‌గా ప్రేక్షకులను తొలిరోజే థియేటర్లకు రప్పించేలా ఉంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్స్, పాటలు అన్నీ కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ అంచనాలను ఆకాశానికి పెంచేసింది.







## యూవీ క్రియేషన్స్‌లో వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా యంగ్ అండ్ టాలంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ ఓ సినిమా రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోర్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో రానుంది. వరుణ్‌తేజ్15 వర్కింగ్ టైటిల్‌తో వరుణ్ తేజ్ 15 సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ వియత్నాంలో శరవేగంగా జరుగుతోంది. హీరో వరుణ్ తేజ్, డైరెక్టర్ మేర్లపాక గాంధీతో పాటు నిర్మాతలు వియత్నాంలో అద్భుతమైన లొకేషన్స్‌ను చూస్తున్నారు. అలాగే స్క్రిప్ట్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి మార్చి మొదటి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. వరుణ్ తేజ్‌తో చేయబోతున్న ఈ సినిమా కోసం డైరెక్టర్ మేర్లపాక గాంధీ యూనిక్ స్టోరీలైన్‌ను డిజైన్ చేశారు. సరికొత్త జానర్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ ఇప్పటి వరకు కనిపించని సరికొత్త మేకోవర్‌తో స్క్రీన్‌పై మెస్మరైజ్ చేయనున్నారు.

## విజయ్ ఆంటోనీ పరాశక్తి పోస్టర్



విభిన్న కథా చిత్రాలతో ఆకట్టుకుంటున్న విజయ్ ఆంటోనీ ఎప్పటికప్పుడు ఆడియన్స్ పల్స్ పట్టేస్తున్నారు. వినూత్న కథాంశాలతో వైవిధ్యభరితమైన పాత్రలతో అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు తన 25వ చిత్రాన్ని ఓ డిఫరెంట్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. పరాశక్తి అనే పేరుతో ఈ సినిమా రాబోతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. “అరువు”, “వాజిల్” వంటి ప్రసిద్ధ చిత్రాలను రూపొందించిన ప్రముఖ దర్శకుడు, రచయిత అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజయ్ ఆంటోనీ ఈ సినిమాలో అసాధారణమైన నటన, అంకితభావాన్ని ప్రదర్శించనున్నారట. ఈ చిత్ర టైటిల్ పోస్టర్ మరింత ఆకట్టుకోవడమేగాక, ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. పరాశక్తి ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించేందుకు మాస్ అప్పీల్, అత్యుత్తమ యాక్షన్, హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథ ఎలిమెంట్స్ కలిగి ఉంది. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు.

## వరలక్ష్మీ శరత్ కుమార్, సంజీవ్ మేగోటి కాంబో

సీనియర్ నటుడు శరత్‌కుమార్ కూతురిగా వెండితెరకు పరిచయమైనా తన వైవిధ్యమైన నటన, విలన్ పాత్రలతో ఆకట్టుకుంటోంది వరలక్ష్మి. నటిగా సౌతిండియా భాషల్లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని దూసుకుపోతోంది. ఈ క్రమంలో ‘ఆదిపర్వం’ మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమా చేయబోతున్నట్టు సమాచారం. సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సబ్జెక్టు కోసం వరలక్ష్మి శరత్ కుమార్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్ పాత్ర చేయనుంది. భారీ బడ్జెట్‌తో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులను తీసుకోబోతున్నారట. వరలక్ష్మిశరత్‌కుమార్ మెయిన్ లీడ్‌గా సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ ప్రాజెక్టు ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటించనున్నట్టు సమాచారం.


## ‘జీఎస్ హరి ప్యానెల్’ ధ్యేయం



తెలుగు టెలివిజన్ ఆర్టిస్టు అసోషియేషన్ (Artists Association of Telugu Television AATT) కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 31న జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జీఎస్ హరి ప్యానెల్ సభ్యులు మేనిఫెస్టో విడుదల చేశారు. తమ జీఎస్ హరి ప్యానెల్ గెలిస్తే.. తెలుగు టెలివిజన్ ఆర్టిస్టులకు పలు ప్రయోజనాలు అమలు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## భూపేంద్ర పటేల్‌ను కలిసిన మోహన్ బాబు, విష్ణు మంచు

లెజెండరీ నటుడు మోహన్ బాబు, డైనమిక్ స్టార్ విష్ణు మంచు ప్రస్తుతం ‘కన్నప్ప’ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో పాటుగా ప్రమోషన్స్



కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. ఈ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా కన్నప్ప టీమ్ దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తోంది. ఈ క్రమంలో మోహన్ బాబు, విష్ణు మంచు గుజరాత్ ముఖ్య మంత్రి గౌరవనీయులైన శ్రీ భూపేంద్ర పటేల్‌ని కలిశారు. ఈ టూర్‌లో శరత్ కుమార్, ముఖేష్ రిషి, వినయ్ మహేశ్వరి కూడా సందడి చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అతిథి మర్యాదలకు, పలికిన సాదర స్వాగతాలకు కన్నప్ప టీం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ప్రముఖ తెలుగు కళాకారుడు రమేష్ గొరిజాల అందమైన పెయింటింగ్‌ను విష్ణు మంచు ముఖ్యమంత్రికి బహుకరించారు. కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోన్న సంగతి తెలిసిందే.

## రొమాంటిక్ థ్రిల్లర్ గా “సంహారం”

గతంలో దాసరి, మోహన్ బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ తదితరుల వద్ద వందకు పైగా సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్ గా పనిచేసిన ధర్మ ఇప్పుడు మెగా ఫోన్ పట్టారు. రత్న మేఘన క్రియేషన్స్ పతాకంపై దర్శక, నిర్మాతగా ఆయన తెరకెక్కించిన చిత్రం “సంహారం”. ఆదిత్య, కవిత మహతో హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకుని ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ హైదరాబాద్ లోని ఫిలిం ఛాంబర్ లో జరిగింది. చిత్రం పాటలను, ప్రోమోస్ ను ప్రదర్శించారు. దీనికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ, “గురువు దాసరి కాంపౌండ్ లో పలు చిత్రాలకు ధర్మ పనిచేయడం వల్ల నాకు పరిచయం ఉంది. చిత్రపరిశ్రమలోని ఆటుపోట్లను సుదీర్ఘ అనుభవంలో అర్థం చేసుకుని, అవహగాన చేసుకున్న టెక్నీషియన్ ధర్మ ఈ చిత్రం ద్వారా దర్శక, నిర్మాతగా మారడం అభినందనీయం. పాటలు, ప్రోమోస్ చాలా బావున్నాయి” అని అన్నారు. దర్శక, నిర్మాత ధర్మ మాట్లాడుతూ, “రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఒక అమ్మాయి తనకు, తన అక్కకు అనుకోని ఘటనలు ఎదురైనపుడు తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ తో దుష్టులను ఎలా ఎదుర్కొంది అన్న పాయింట్ తో ఈ సినిమాను మలిచాం.



# ఏజ్ గ్యాప్ మ్యాటరే కాదు

**నందమూరి బాలకృష్ణ సరసన రెండు సినిమాల్లో హీరోయిన్ గా నటించింది ప్రగ్యా జైస్వాల్. అఖండ సినిమాతో పాటూ మొన్న సంక్రాంతికి రిలీజైన డాకు మహారాజ్ సినిమాలో కూడా ప్రగ్యా బాలయ్య సరసన జోడీగా నటించింది. ఈ నేపథ్యంలో బాలయ్య, ప్రగ్యా మధ్య వయసు తేడా చాలా ఉందని, అంత ఏజ్ గ్యాప్ తో ఎలా కలిసి నటించారని విమర్శలు కూడా వచ్చాయి. ఈ విషయంలో ప్రగ్యా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. తనకు, హీరోకు మధ్య వయసు వ్యత్యాసమున్న మాట నిజమేనని, కానీ అదసలు మ్యాటరే కాదని, స్క్రీన్ మీద ఇద్దరినీ చూసినప్పుడు బాగా కనిపిస్తే చాలని తెలిపింది.**

పాత్రను ఎలా డిజైన్ చేశారో దాన్ని బట్టే నటీనటులను తీసుకుంటారని, ఆ పాత్రకు న్యాయం చేయగలను అనిపిస్తేనే ఆ సినిమాలో నటిస్తాను అంతే తప్ప ఏజ్ గ్యాప్ ను పట్టించుకోనని ప్రగ్యా జైస్వాల్ తెలిపింది. మంత్రికి పేషెంట్ తల్లి లేఖ ఇక బాలయ్య గురించి మాట్లాడుతూ, ఆయనతో కలిసి నటించడం ఎంతో ఆనందాన్నిస్తుందని, ఆయన పక్కన ఉంటే పాజిటివిటీ ఉంటుందని, బాలయ్య గారి నుంచి చాలా నేర్చుకోవచ్చుని ప్రగ్యా చెప్పింది. బాలయ్య అందరినీ సమానంగా చూస్తారని, అందరికీ సహకారం అందిస్తూ అందరి పట్ల ఎంతో గౌరవంగా ఉంటారని చెప్పిన ప్రగ్యా.. కెమెరా ఆన్, ఆఫ్ మధ్యలో ఈజీగా ఎలా మారొచ్చో ఆయన లాంటి లెజెండ్స్ దగ్గర చూసి నేర్చుకోవాలని, ఆయనలో ఎలాంటి ఫిల్టర్స్ ఉండవని బాలయ్యను తన పొగడ్తలతో ఆకాశానికెత్తేసింది. డాకు మహారాజ్ గురించి చెప్తూ ఆ సినిమా తన పుట్టినరోజైన జనవరి 12న రిలీజైందని తెలిపింది. తన బర్త్ డే రోజున రిలీజవడమే స్పెషల్ అనుకుంటే ఆ సినిమా బ్లాక్ బస్టర్ అవడం మరో స్పెషల్ అని, బాలయ్య గారితో కలిసి ఆ విజయాన్ని అందుకోవడం ఇంకా స్పెషల్ అని ప్రగ్యా తెలిపింది. ఈ ఇయర్ తనకు మంచి ఆరంభాన్ని ఇచ్చిందని, సినిమాలో కావేరి పాత్రపై అందరూ ప్రేమను కురిపిస్తున్నారని ప్రగ్యా తెలిపింది. డాకు మహారాజ్ చూశాక అందరూ తనని డాకు మహారాణి అంటున్నారని, సినిమాలో గర్భవతిగా నటించడం చాలా కొత్తగా అనిపించిందని, కడుపులోని బిడ్డ కోసం కావేరి చేసిన పోరాటాన్ని అందరూ అభినందిస్తున్నారని ప్రగ్యా ఆనందం వ్యక్తం చేసింది. బాబీ కొల్లి దర్శకత్వంలో వచ్చిన డాకు మహారాజ్ రూ.150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను అందుకుని మంచి హిట్‌గా నిలిచింది.



## దీప ఆర్ట్స్ “ఏజెంట్ గై 001”

డేవిడ్ ఆండర్సన్ దర్శకత్వంలో ఎరిక్ ఆండర్సన్ నిర్మాతగా బాల్టాజర్ ప్లాటో, డేవిడ్ ఆండర్సన్ స్క్రీన్ ప్లే వహిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న హాలీవుడ్ డబ్బింగ్ చిత్రం ఏజెంట్ గై 001. ఈ చిత్రానికి ఆంటోన్ క్లాడ్ జంపర్ గెస్టిన్ సంగీతాన్ని అందించగా డెన్నిస్ ఆండర్సన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరించారు. ఆంటోన్ కార్ల్సన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. బాల్టాజర్ ఫ్లోటో, ఆంటోనీ స్జోలండ్, మిల్టన్ బిజోర్న్‌గ్రెన్, నాట్ వెస్ట్ బ్యాక్, ఓమర్ మీర్జా కీలక పాత్రలో నటిస్తూ వస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో పి శ్రీనివాస గౌడ్ నిర్మిస్తూ సహాయ నిర్మాతగా పి హేమంత్ వ్యవహరిస్తూ దీప ఆర్ట్స్ బ్యానర్ ద్వారా జనవరి 31వ తేదీన ఎంతో ఘనంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే తెలుగులో విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ చూస్తుంటే జేమ్స్ బాండ్ చిత్రాల తరహాలో వస్తున్న మరొక అద్భుతమైన యాక్షన్ అండ్ అడ్వెంచర్లు కలిగిన చిత్రంగా ఈ సినిమా ఉండబోతున్నట్లు అర్థమవుతుంది. చిత్రం ఎంత నాణ్యంగా ఉండబోతుంది అనేది టీజర్ లోని నిర్మాణం విలువలు ద్వారా చాలా క్లియర్ గా అర్థమవుతున్నాయి.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044